ప్రజాశక్తి
శనివారం 25 మే 2024 8 పేజీలు

గుంటూరు పల్నాడు

చెల్లుబాటుపై సందేహాలు!

- పోస్టల్ ఓట్లపై ఉత్కంఠ
- గుంటూరు,పల్నాడు జిల్లాల్లో 50 వేల ఓట్ల వినియోగం
- 4న లెక్కింపుతో బహిర్గతం కానున్న చెల్లుబాటు కాని ఓట్ల వ్యవహారం
- 2019లో 10 వేల ఓట్లు చెల్లక ఫలితాలు తారుమారు

ఈనెల 7వ తేదీన గుంటూరులో పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకునేందుకు నిరీక్షిస్తున్న ఉద్యోగులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి రికార్డు స్థాయిలో పోస్టల్ బ్యాలెట్లు పోలవ్వడంతో ఈ ప్రభావం ఫలితాలపై ఎంత వరకు ఉంటుందనే అంశంపై రాజకీయ పక్షాల్లో చర్చ జరుగుతోంది. పోస్టల్ బ్యాలెట్ల కొనుగోలుకూ టిడిపి, వైసిపి పోటాపోటీగా పనిచేశాయి. మంగళగిరికి చెందిన ఒక సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టల్ బ్యాలెట్‌కు రూ.5 వేలు తీసుకుని ఉద్యోగం నుంచి సస్పెండ్ అయ్యారు. అయితే పోలయిన పోస్టల్ బ్యాలెట్లు అని అర్హత కలిగినవేనా? ఎన్ని ఓట్లు చెల్లుతాయి? ఎన్ని ఓట్లు చెల్లుబాటు కాకుండా పోతాయి అనేఅంశంపై ఉద్యోగ, రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

2019 ఎన్నికల్లో ఉద్యోగులు చేసిన చిన్నపొరపాటు వల్ల గుంటూరు లోక్‌సభ పరిధిలో 10 వేల ఓట్లు చెల్లుబాటు కాకుండా పోయాయి. దీని వల్ల ఫలితాలు తారుమారయ్యాయి. పోస్టల్ ఓట్లు తనకే ఎక్కువగా

▶ 2లో

పిన్నెల్లిపై హత్యాయత్నం కేసు!

పాల్వాయిగేటు పోలింగ్ కేంద్రం ఏజెంటుపై దాడి ఘటన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెంటచింతల పోలీసులు కేసునమోదు చేశారు. రెంటచింతల మండలం పాల్వాయిగేటు వద్ద గల పోలింగ్ కేంద్రంలో ఏజెంటు నంబూరు శేషగిరిరావుపై దాడి ఘటనపై టిడిపి నాయకులు ఫొటోలు, వీడియోలతో ఎన్నికల కమిషన్‌కు ఇటీవల ఫిర్యాదు చేశారు. దాడికి ముందు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసిన రామకృష్ణారెడ్డిని అడ్డుకోవడానికి శేషగిరిరావు ప్రయత్నించారు. అయితే ఆయన తనను వేలుపెట్టి చూపించి తనను బెదిరించారని శేషగిరిరావు తెలిపారు. ఆ తర్వాత కొద్దిసేపటికి శేషగిరిరావుపై దాడి జరగ్గా ఆయన తల పగిలింది. దీనిపై తాను పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో ఈవీఎం పగులగొట్టిన వ్యవహారం బయటకు వచ్చిన తరువాత నేరుగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డితోపాటు, దాడి చేసిన ఇతరులపైనా శేషగిరిరావు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

మాచర్ల వెళ్లద్దు - పిన్నెల్లికి హైకోర్టు ఆదేశం

ఈవీఎంల ధ్వంసం కేసులో ప్రధాన నిందితుడుగా ఉన్న ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి మధ్యంతరం బెయిల్ మంజూరు చేసిన హైకోర్టు కొన్ని షరతులను విధించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. జూన్ 6 వరకు మాచర్ల వెళ్ల కూడదు. పార్లమెంటు నియోజకవర్గ కేంద్రం నర్సరావుపేటలో ఉండాలి. 4వ తేదీన ఓట్ల లెక్కింపునకు మాత్రమే హాజరు కావాలి. ఈవీఎంల ధ్వంసం వ్యవహారంపై మీడియాతో మాట్లాడరాదని ఆంక్షలు విధించారు. ఆయన కథలికలపై నిఘా ఉంచాలని ఎన్నికల కమిషన్‌కు, పోలీసులకు హైకోర్టు ఆదేశించింది.

విద్యుత్ వైర్లు తగిలి రైతు దుర్మరణం

ప్రజాశక్తి - మాచర్ల

పొలానికి మందు చల్లుతుండగా విద్యుత్ వైర్లు తగిలి రైతు దుర్మరణం పాలైన ఘటన మాచర్లలో శుక్రవారం జరిగింది. పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ముక్కాల శ్రీను (58) పట్టణ సమీపంలో తనకున్న మూడున్నర ఎకరాల్లో కొంత విస్తీర్ణంలో దోసకాయలు సాగు చేశాడు. ఈ పొలంలో మందును పిచికారీ చేసేందుకని శుక్రవారం పొలానికి ట్రాక్టర్ తీసుకుని వెళ్లాడు. పని పూర్తయ్యాక మరో పొలంలోనూ మందును వేసే పని ఉండడంతో అక్కడికి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఇందులో భాగంగా మందును పిచికారీ చేసే సామగ్రిని సర్దుకుంటుండగా పొలంలో నుండి తక్కువ ఎత్తులో వెళ్తున్న హై టెన్షన్ విద్యుత్ వైర్లకు మందు పరికరాలు తగిలి శ్రీనుకు షాక్ కొట్టింది. పెద్దపెట్టున అరుస్తూ అక్కడికక్కడే కుప్పకూలాడు. ఇది గమనించిన సమీప పొలాల్లోని వారు మృతుని కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రధాన సమస్యలను విస్మరించిన ఆ పార్టీలు

- కేంద్రంలో ఏ ప్రభుత్వం వచ్చినా రాష్ట్ర హక్కుల కోసం ఇక్కడ ఏర్పడే ప్రభుత్వం కృషి చేయాలి
- ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు పోరాటాలకు ప్రజలు సిద్ధమవ్వాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ప్రజలెదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఇటీవల సార్వత్రిక ఎన్నికల్లో ఎన్‌డిఎ కూటమి పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి, అధికార వైసిపి విస్మరించాయని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య విమర్శించారు. అధిక ధరలు, నిరుద్యోగం, రాజధాని నిర్మాణానికి నిధులు, ఇతర తదితర ప్రధాన సమస్యలను ప్రస్తావించకుండా వ్యక్తిగత ఆరోపణలు, ఆవేశపూరిత విమర్శలతో సరిపుచ్చారని అన్నారు. సిపిఎం పల్నాడు జిల్లా విస్తృత సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ అధ్యక్షతన స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్ర విభజన హామీలు, పోలవరం నిర్మాణం, ప్రత్యేక

▶ 2లో

24 గంటలూ పటిష్ట నిఘా

- ఓట్ల లెక్కింపు నేపథ్యంలో భద్రత పెంపు
- సమస్యాత్మక ప్రాంతాల్లో 144 సెక్షన్
- గ్రామాల్లో గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు
- రౌడీషీటర్లపై ప్రత్యేక దృష్టి

ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద భద్రతను పరిశీలిస్తున్న పల్నాడు ఎస్పీ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఓట్ల లెక్కింపు రోజు సమీపిస్తున్న కొద్దీ ఉద్రిక్తత వాతావరణం పెరుగుతోంది. మరోవైపు అవాంఛనీయ ఘటనలు మరోసారి తలెత్తకుండా పోలీసులు జిల్లా వ్యాప్తంగా నిఘా, భద్రతా చర్యలు చేపట్టారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రాంతాల్లో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారు. ఎన్నికల ఫలితాల ముందుగానీ, తరువాత గానీ గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, స్టేజ్ ప్రోగ్రాంలకు అనుమతుల్లేవని పల్నాడు జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ఇప్పటికే స్పష్టం చేశారు. నిబంధనలను ఎవరు మీరినా చర్యలుంటాయని హెచ్చరికలు జారీ చేశారు. ప్రజలను రెచ్చగొట్టేలా రాజకీయ నాయకుల సందేశాలు, నిరాధార ఆరోపణలు, రచ్చబండ చర్చలు, సోషల్ మీడియాలో ప్రచారం మొదలైన వాటిని నేరంగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. పెట్రోలు బంకుల్లో వాహనానికి తప్ప క్యాన్లలో పెట్రోల్ అమ్మకాలతో పాటు బాణసంచా విక్రయాలపై ఆంక్షలు విధించారు. జూదం, కోడి పందేలు, బెట్టింగ్ మొదలైన చట్టవిరుద్ధ కార్యకలాపాలపై

▶ 2లో

అడల్ట్ బిసిజి వ్యాక్సిన్‌కు 1.77 లక్షల మంది సమ్మతి

ప్రజాశక్తి-గుంటూరు

అడల్ట్ బిసిజి వ్యాక్సిన్ వేయించుకోవటానికి జిల్లాలో 1.77 లక్షల మంది వారి సమ్మతి తెలియజేశారని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యాక్సినేషన్‌కు రాష్ట్రంలో 12 జిల్లాలను కేస్ స్టడీ కింద ఎంపిక చేశారని, వాటిల్లో గుంటూరు జిల్లా కూడా ఒకటని తెలిపారు. కావున జిల్లాలో వ్యాక్సిన్ కోసం సమ్మతి తెలియజేసిన వారికి ప్రతి గురువారం వార్డు సచివాలయాల్లో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకూ వ్యాక్సిన్ వేయటం జరుగుతుందన్నారు. ఈ వ్యాక్సిన్ కార్యక్రమం జులై వరకూ కొనసాగుతుందని చెప్పారు. 60 ఏళ్లు పైబడిన వారు, 18-60 ఏళ్ల వయస్సు ఉన్న ధూమపానం చేసే వారు, షుగర్ వ్యాధిగ్రస్తులు, బాడీ మాస్ ఇండెక్స్ 18 కంటే తక్కువ ఉన్న వారు, క్షయ వ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు, 2018 నుండి టిబి బారిన పడిన చికిత్స పొందుతున్న వారు, 2021 జనవరి నుండి టిబి వ్యాధిగ్రస్తులతో కాంటాక్ట్‌లో ఉన్న వారు ఈ వాక్సిన్‌కు అర్హులని తెలిపారు. 18 ఏళ్ల లోపు వారు, గర్భిణు, హెచ్ఐవి వ్యాధిగ్రస్తులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, కేన్సర్ పేషెంట్లు, వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు, మూడు నెలలలోపు రక్తమార్పిడి చేయించుకున్న వారు, వ్యాక్సిన్ చేయించుకోవటానికి సమ్మతిని నిరాకరించిన వారు, బిసిజి, ఇతర వ్యాక్సిన్లకు గతంలో తీవ్ర రియాక్షన్ వచ్చిన వారు అనర్హులు అని వివరించారు.

హింసాత్మక ఘటనలకు తావులేకుండా చూడాలి

కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు అందించాలి

8లో

విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - పొన్నూరు

పొన్నూరు మండలనికి సంబందించిన విద్యా కానుక స్టాక్ పాయింట్ ను నిడుబ్రోలు జడ్పి హెచ్ హైస్కూల్ లో ఉన్న స్టాక్‌ను జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ జి . విజయ లక్ష్మి , సిఎంఒ సుజాత సందర్శించారు, మండల విద్యాశాఖాధికారి-1 ఆర్. శోభా చంద్ మండల విద్యా శాఖాధికారి-2 కె.శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

గుంటి ఆంజనేయస్వామి దీక్షా స్వాముల చద్దికి

లక్ష రూపాయల విరాళం

ప్రజాశక్తి - వినుకొండ

పట్టణంలోని శ్రీ గుంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ప్రతి సంవత్సరం హను మాన్ దీక్ష స్వాములకు ఏర్పాటు చేస్తున్న చద్ది కార్యక్రమానికి ఒక లక్ష రూపాయలు విరాళం ఇస్తున్నట్లు వినుకొండ పట్ట ణంలోని దుర్గాంజనేయ ఇండస్ట్రీస్ అండ్ అక్షయ క్యాటరింగ్ యజ మాని యిమ్మడిశెట్టి వెంకట సుబ్బా రావు శుక్ర వారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 రోజుల పాటు దీక్ష తీసుకొని భక్తి శ్రద్ధలతో కార్యక్రమాలు నిర్వహించుకునే హనుమాన్ దీక్ష స్వాముల చద్ది కార్య క్రమానికి తమ కుటుంబం తరుపున లక్ష రూపాయలు విరాళం ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు.

చద్ది కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 12 సంవత్సరాలుగా ఆంజనేయస్వామి దేవస్థానంలో దీక్ష స్వాములకు చద్ది ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమానికి ఎంతో మంది సందర్శకులు తమ సహాయ సహకారాలు అంది స్తున్నారని అన్నారు. దీక్ష స్వాముల చద్దికి యిమ్మడిశెట్టి సుబ్బారావు విరాళం ప్రకటించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం చద్ది కమిటీ సభ్యులు సుబ్బారావును సన్మానించి అభినందించారు.

ఉత్తమ ప్రదర్శనగా 'స్వప్నం రాల్చిన అమృతం'

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

మండలంలోని వరగానిలో గత మూడు రోజుల నుంచి జరుగుతున్న .లావు వెంకటేశ్వర్లు కల్లూరి నాగేశ్వరరావు కళాపరిషత్ వారి తెలుగు రాష్ట్రాల 8వ ఆహ్వాన నాటికల పోటీలు గురువారం అర్ధరాత్రితో ముగిసాయి. మూడు రోజుల నుండి రోజుకు మూడు నాటికలు చొప్పున 9 నాటికలు ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనగా కరీంనగర్ చైతన్య కళాభారతి వారి స్వప్నం రాల్చిన అమృతం ఎంపికైంది. ద్వితీయ ప్రదర్శనగా గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ఇంద్రప్రస్థం , తృతీయ ప్రదర్శనగా విశాఖ పట్నం తెలుగు కళా సమితి వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంత ఎంపికైంది.

జూరీ ప్రదర్శనగా తాడేపల్లి అరవింద ఆర్ట్స్ వారి మనస్విని ఎంపికైంది. ఉత్తమ నటుడుగా కౌసల్య సుప్రజా రామా నాటిక లో శ్రీరామ పాత్రధారి గోపరాజు విజయ్ , ఉత్తమ నటిగా కమనీయంలో రాగ సుధారాజ్యం పాత్రధారి గుడివాడ లహరి, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా కమనీయం లో నారాయణయ్య పాత్ర దారిబసవరాజు ఎంపికయ్యారు. ఉత్తమ ద్వితీయ నటుడిగా నిశ్శబ్దమా నీ ఖరీదెంత నాటికలో కుమార్ పాత్రధారి వరప్రసాద్, ఉత్తమ ద్వితీయ నటిగా స్వప్నం రాల్చిన అమృతంలో స్వప్న పాత్రధారి సాయి సుప్రియ ,సహాయనటుడిగా కాపలా నాటికలో ఎస్సై పాత్రధారి మనోహం,సహాయనటిగా కాపలా నాటికలో ధీరజ పాత్రధారి కుసుమ, ప్రతి నాయకుడిగా నిశ్శబ్దమా నీ ఖరీదు ఎంత లో పల్లవి పాత్ర దారి హేమ, ఉత్తమ హాస్య నటుడిగా పక్కింటి మొగుడు నాటికలో సీతాపతి పాత్రధారి శేషయ్య ఎంపికయ్యారు. ఉత్తమ రచయితగా కమనీయం నాటిక మునిపల్లె విద్యాధర్ ఎంపిక కాగా, ఉత్తమ దర్శకునిగా ఇంద్రప్రస్తం డైరెక్టర్. రవీంద్ర రెడ్డి ఎంపికయ్యారు. ఉత్తమ సంగీతం కమనీయం నాటిక రమణ అండ్ పార్టీ, ఉత్తమ అహర్యం మనస్విని నాటిక శ్రీధర్, ఉత్తమ రంగాలంకరణ ఇంద్రప్రస్థం నాటిక అనిల్, ఉత్తమ లైటింగ్ స్వప్నం రాల్చిన అమృతం నాటిక. నాగు ఎంపికయ్యారు. జ్యూరీ బహుమతులను ఇంద్రప్రస్థంలో సందీప్ పాత్రధారి సూర్య. నిశబ్దమా నీ ఖరీదు ఎంత నాటికలో హెడ్ పాత్రధారి రాంబాబు. మనస్విని నాటికలో నాగరాణి. రంగనాయకులు ఎంపికయ్యారు.

విజయవంతంగా కొనసాగుతున్న 'మంగళకరము-2024'

- ది హ్యాండ్ ప్రాజెక్టు ఫౌండర్ క్రిస్ గల్లీ, టీమ్ మమేకం
- ఆరు దేశాల నుంచి విచ్చేసిన ఫిట్మెంట్ నిపుణులు
- కృత్రిమ చేతుల ఉచిత పంపిణీ ఏర్పాట్లపై మంగళగిరి రోటరీక్లబ్ కు అభినందన

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి రోటరీక్లబ్ చేపట్టిన అత్యంత విలువైన సర్వీసు ప్రాజెక్టు మంగళకరము -2024 జెమ్ ఎంకె1 హ్యాండ్స్... కృత్రిమ చేతుల ఉచిత పంపిణీ కార్యక్రమం శుక్రవారానికి ఐదో రోజుకు చేరుకుంది. మంగళగిరిలోని వీటీజేఎం అండ్ ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో నిర్వహిస్తున్న మంగళకరము-2024 ప్రాజెక్టును తిలకించేందుకు స్థానిక ప్రముఖులేకాకుండా దూరప్రాంతాల నుంచి కూడా ఇక్కడికి వస్తుండడం విశేషం. ఏలూరు జిల్లా ద్వారకా తిరుమలలోని విఐఆర్ఆర్ డి ట్రస్టు హాస్పటల్ నుంచి ప్రతినిధులు విచ్చేసి ప్రాజెక్టు తీరుతెన్నులను పరిశీలించారు.

కృత్రిమ చేతుల ఉచిత పంపిణీ ప్రాజెక్టుకు ఒక కోటీ 35 లక్షల మేర ఖర్చవుతోంది. జర్మనీకి చెందిన ది హ్యాండ్ ప్రాజెక్టు, అసిస్ట్, చిలకలూరిపేట లతో పాటు మంగళగిరి రోటరీ కరవాలంబన ట్రస్టు సౌజన్యంతో నిర్వహిస్తున్న అత్యుత్తమ సర్వీసు ప్రాజెక్టును విజయవంతంగా నిర్వహించేందుకుగాను ది హ్యాండ్ ప్రాజెక్టు వ్యవస్థాపకులు క్రిస్ గల్లీ సహా ఆరుగురు ఫిట్మెంట్ నిపుణుల బృందం ఆరు దేశాల నుంచి మంగళగిరి వచ్చారు.

గత ఏడేళ్లుగా కృత్రిమ చేతులకు సంబంధించి విశేషంగా కృషి చేస్తున్న క్రిస్ గల్లీ ఇంతకు ముందు ఆఫ్రికా, నేపాల్, బంగ్లాదేశ్ వంటి దేశాల్లో ఈ ప్రాజెక్టులు నిర్వహించారు. భారతదేశంలో తొలిసారిగా మంగళగిరి రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జెమ్ ఎంకే1 హ్యాండ్స్ కృత్రిమ చేతుల ఉచిత పంపిణీలో క్రిస్ గల్లీ నిపుణుల బృందం మమేకమై.. సామాజిక బాధ్యతగా.. నిబద్ధతతో ఎంతో ఓపిగ్గా వికలాంగ లబ్ధిదారులకు కృత్రిమ చేతులను అమర్చే ప్రక్రియను విజయవంతంగా నిర్వహిస్తోంది.

క్యాంప్ నిర్వహణ తీరుపై ది హ్యాండ్ ప్రాజెక్టు ఫౌండర్ క్రిస్ గల్లీ నిపుణుల బృందం సంతప్తివ్యక్తం చేస్తోంది. తాము గతంలో నిర్వహించిన క్యాంపులకన్నా మిన్నగా సౌకర్యాల కల్పనలోగాని, వికలాంగ లబ్ధిదారులపై కనబరుస్తున్న ఆప్యాయతపై ప్రశంసలు కురిపించారు. ది హ్యాండ్ ప్రాజెక్టు ఫిట్మెంట్ ఎక్స్ పర్ట్, టీము ఆర్గనైజర్ డి.సుకన్యరావు ఈ ప్రాజెక్టు నిర్వహణకు చక్కగా ఏర్పాట్లు చేశారని అభినందించారు. మంగళగిరి రోటరీ క్లబ్ అధ్యక్షులు అందె రేవంత్, కార్యదర్శి గాజుల శ్రీనివాసరావు, కోశాధికారి నూతలపాటి వెంకటేశ్వరరావు, సర్వీస్ ప్రాజెక్టు డైరెక్టర్ అందె మురళీమోహన రావు, ప్రాజెక్టు చైర్మన్ అనిల్ చక్రవర్తి ఇసునూరులతో పాటు రొటేరియన్లు మంగళకరము 2024 ప్రాజెక్టును విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లడంలో తమ వంతు కృషి చేస్తున్నారు.

చెల్లుబాటుపై సందేహాలు!

(మొదటి పేజీ తరువాయి)

అనుకూలంగా పడ్డాయని, కానీ 10 వేల ఓట్లు చెల్లుబాటు కాకుండా పోవడం వల్ల తాను ఓడిపోయా యని వైసిపి లోక్‌సభ అభ్యర్థి మోదుగుల వేణుగోపాల రెడ్డి వాపోయారు. ఈ అంశంపై ఆయన హైకోర్టును ఆశ్రయించినా విచారణకు ఐదేళ్లు పట్టింది. కానీ ఆయనకు అనుకూలంగా తీర్పు రాలేదు. ఆయనపై పోటీ చేసిన టిడిపి అభ్యర్థి గల్లా జయదేవ్ 4800 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందడం మోదుగులను బాగా కుంగదీసింది.

ఈ నేపథ్యంలో ఈసారి పోస్టల్ ఓట్లపై ప్రధాన పార్టీలు దృష్టిసారించాయి. జిల్లాలో 23,500 ఓట్ల పోస్టల్ ఓట్లు పోలవ్వగా సర్వీసు ఓటర్లుకు సంబంధించి మరో 1500 ఓట్ల వరకు వచ్చాయి. జూన్ 3 వరకు ఆన్‌లైన్‌లో ఓటు వేసి పోస్టు ద్వారా బ్యాలెట్ పంపే రక్షణ శాఖ ఉద్యోగులకు అవకాశం ఉంది. గుంటూరు పార్లమెంటు పరిధిలో 25 వేలు, నర్సరావుపేట పార్లమెంటు పరిధిలో మరో 25 వేల వరకు పోస్టల్ బ్యాలెట్‌ను జూన్ 4న లెక్కించాల్సి ఉంది. అయితే ఉద్యోగులు, అధికారులు కూడా తమ బ్యాలెట్‌లను సక్రమంగా బాక్సులో వేయకపోతే ఇన్‌వాలిడ్‌గా పరిగణిస్తారు. ప్రధానంగా డిక్లరేషన్ ఫారంపై గెజిటెడ్ అధికారి సంతకం తప్పనిసరి. అంతేగాక ఆయన హోదాతో కూడిన స్టాంపు వేయాలి. లేదా ఆయన స్వయంగా పేరు హోదా రాయాలి. కేవలం సంతకం చేస్తే ఓటు చెల్లదు. డిక్లరేషన్ నంబరు మెయిన్ కవర్‌పైనా, బ్యాలెట్ పైన నెంబరు పోస్టల్ బ్యాలెట్ ఉంచే కవర్‌పైన నమోదు చేయాలి. వీటిలోఏది పొరపాటు చేసినా ఓటు చెల్లదు.

గత ఎన్నికల్లో కవర్‌పై సంతకం లేకపోవడం వల్ల ఎక్కువ ఓట్లు చెల్లకుండా పోయాయి. ఈసారి కవర్ పై సంబంధిత ఉద్యోగి, అధికారి సంతకంకు మినహాయింపు ఇచ్చారు. ఉద్యోగులు, అధికారులే డిక్లరేషన్ ఫారాలను రెండు వేర్వేరు కవర్లలో పెట్టి బాక్సులో వేయాలి. పార్లమెంటుకు, అసెంబ్లీకి వేర్వేరుగా రెండు డిక్లరేషన్‌లను పొరపాటుగా వేసినా అనర్హతగా నిర్ధారిస్తారు. తాజాగా గెజిటెడ్ అధికారి సంతకం ఉంటే సరిపోతుందని, హోదాతోకూడిన స్టాంపు లేకున్నా అనుమతించాలని టిడిపితో పాటుపలువురు ఉద్యోగ సంఘాలు ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశాయి. ఈ అంశంపై ఇంకా ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకోలేదు. 4వ తేదీన ఓట్ల లెక్కింపు తొలుత పోస్టల్ బ్యాలెట్‌లతోనే ప్రారంభిస్తారు. మొత్తం 14 టేబుల్స్ ఏర్పాటు చేసి టేబుల్‌కు 500 ఓట్ల చొప్పున 4 రౌండ్లలో లెక్కిస్తారు. ఒక్కో రౌండ్‌కు ఏడు వేలు చొప్పున లెక్కించే అవకాశం ఉంది. అయితే పోలయిన ఓట్లలో చెల్లినవి, చెల్లుబాటు కానివి ముందుగా విభజించి ఆ తరువాత లెక్కింపు ప్రారంభిస్తారని అధికార వర్గాలు తెలిపాయి.

ప్రధాన సమస్యలను విస్మరించిన ఆ పార్టీలు

(మొదటి పేజీ తరువాయి)

హోదా, విద్యుత్ బిల్లుకు సవరణలు వంటి అనేక సమస్యలు రాష్ట్రాన్ని పట్టిపీడిస్తుండగా ప్రధాన రాజకీయ పార్టీలేవీ వీటిని చర్చకు రానీయకుండా ప్రక్కదోవ పట్టించాయని అన్నారు. కులం, మతం, డబ్బు, మద్యం ప్రభావంతో ఎన్నికలు సాగిపోయాయని చెప్పారు. అధికారంలోకి ఏ ప్రభుత్వం వచ్చినా వారు అమలు చేసే ప్రజా వ్యతిరేక విధానాలపై రైతులు, కార్మికులు, మధ్యతరగతి ప్రజలు ఉద్యమించక తప్పని పరిస్థితులు వస్తాయని చెప్పారు. కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా రాష్ట్రానికి రావాల్సిన హక్కులను సాధించడం కోసం రాష్ట్రంలో ఏర్పడే ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. గత పదేళ్లలో కేంద్ర ప్రభుత్వం 250 ప్రజా వ్యతిరేక చట్టాలు చేసిందని, వీటికి రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలూ మద్దతిచ్చాయని, ఇదే అమలైతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. ఈ ప్రజావ్యతిరేక చట్టాలు, విధానాలను తిప్పికొట్టడానికి ప్రజలు ఐక్యపోరాటాలకు సిద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. ఓట్ల లెక్కింపు రోజు పూర్తి బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఖరీఫ్ సాగుకు అవసరమైన విత్తనాలు, ఎరువులను రైతులకు అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు. కౌల్దార్లందరికీ గుర్తింపు కార్డులు, రుణాలు, రాయితీపై విత్తనాలు, ఎరువులు అందించాలని డిమాండ్ చేశారు. నాగార్జునసాగర్ కాల్వలకు మరమ్మతులు చేయించి నీరు సరిగా పారుదల అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు గద్దె చలమయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎ.లక్ష్మీశ్వర్‌రెడ్డి, ఎస్.ఆంజనేయులునాయక్, ఎవిఎన్ గోపాలరావు, నాయకులు జి.బాలకృష్ణ, శివకుమారి, పి.మహేష్, కె.శివదుర్గారావు, జె.రాజ్‌కుమార్, ఎ.వీరబ్రహ్మం, జి.ఉమశ్రీ, జి.రజిని, ఆంజనేయరాజు, వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

24 గంటలూ పటిష్ట నిఘా

(మొదటి పేజీ తరువాయి)

ఉక్కుపాదం మోపుతామని పోలీసులు ప్రకటించారు. జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో నాటుసారా, మద్యం,నిషేదిత వస్తువులు, అక్రమ రవాణా జరగకుండా ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. అపరిచిత వ్యక్తులు, అనుమానిత వ్యక్తులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. కౌంటింగ్ రోజు ముందు లేదా తర్వాత రోజు వివాదాల్లో పాల్గొనే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరిస్తున్నారు.

ఇప్పటికే 1500 మంది బైండోవర్

గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, వివిధ గ్రూపులకు చెందిన వారు, ప్రజలతో సిఐ, ఎస్ఐ స్థాయి పోలీసు అధికారులు మావేశాలు నిర్వహిస్తున్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనలకు పాల్పడితే తీసుకునే కఠిన చర్యలను వివరిస్తున్నారు. గ్రామాల్లో పోలీసు పికెట్, పెట్రోలింగ్, ఔట్ పోస్టులను ఏర్పాటు చేస్తున్నారు. అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించేవారు, ప్రజలను ఇబ్బంది పెట్టేవారిని గుర్తించి ముందస్తుగా బైండోవర్ చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి దాకా 1500 మందిని బైండోవర్ చేశారు. వీరిలో రౌడీషీటర్లకు, నేర చరిత్ర కలిగిన వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత

మరోవైపు నరసరావుపేట మండల పరిధిలోని కాకాని వద్ద జెఎన్‌టియు కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట బందోబస్తు చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే కేంద్ర బలగాలు, ఆర్మీ, సివిల్ పోలీసులతో పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు. 24 గంటలూ నిరంతర సిసి కెమెరాల నిఘా, ప్రత్యేక సాయుధ బలగాల పహారా ఏర్పాట్లు చేస్తున్నారు. స్ట్రాంగ్ రూంల భద్రతను ఎస్పీ మలికా గార్గ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ముగిసేవరకూ అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - నాదెండ్ల

రోడ్డు ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డ సంఘటన గుంటూరు కర్నూలు రహదారిపై సాతులూరు కోళ్ల ఫారం సమీపంలో శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో చోటు చేసుకుంది. పేరే చర్లకు చెందిన ఒక వ్యక్తి, బోయ పాలానికి చెందిన ఒక వ్యక్తి, శ్రీనివాసరావు, కూర్చు న్న వ్యక్తి పేరు దేవ దానం, సాతులూరులో కోళ్ల ఫారంలో పని చేసేందుకు గత నాలుగు రోజుల క్రితం పేరేచర్ల నుంచి వచ్చి కోళ్ల ఫారంలో పని చేస్తున్నారు సాతులూరులోకి వచ్చి తిరిగి ద్విచక్ర వాహనంపై కోళ్ల ఫారం వద్దకు వెళుతుం డగా గుంటూరు వైపు నుండి నరసరావుపేట వైపు వెళ్తున్న ట్యాంకర్ ను వేగంగా వెళ్లి ద్విచక్ర వాహనం ఢీ కొట్టింది.

కోనేరులో వ్యాపారి మృతదేహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు ఆర్.అగ్రహారం కోనేరులో ఒక వ్యక్తి మృతదేహాన్ని లాలాపేట పోలీసులు శుక్రవారం గుర్తించారు. మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడు ఇదే ప్రాంతానికి చెందిన కొన కళ్ల మురళీకృష్ణ (54)గా గుర్తించారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో ఆయన ఆత్మహత్యకు పాల్పడ్డట్టు భావిస్తున్నారు. అను మానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యా ప్తు చేస్తున్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రైలు కిందపడి ఒక వ్యక్తి ఆత్మహత్య చేసు కున్న ఘటనపై శుక్రవారం గుంటూరు రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీ సుల వివరాల మేరకు.. వేజెండ్ల నుంచి మణి పురం రైల్వే స్టేషన్ మధ్య 35 సంవత్సరాల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై వెంకటాద్రి ఘటనస్థలి పరిశీలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు గుంటూరులోని జిఆర్పి పోలీసులను సంప్రదించాలని కోరారు.

20 మందిపై హత్యాయత్నం కేసు

ప్రజాశక్తి - రెంటచింతల

ఈనెల 13న నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన టిడిపి నేతలపై మారనాయుధాలతో దాడి చేసిన ఘట నకు సంబంధించి 20 మందిపై 307 సెక్షన్ కింద కేసు నమోదు చేశారు ఈ ఘటనలో ఆరుగురు వ్యక్తులకు గాయాలు కాగా చేరెడ్డి మంజుల, చేరెడ్డి గోపాల్ రెడ్డి, గొంటు నాగమల్లేశ్వర్ రెడ్డిలు తీవ్రంగా గాయపడ్డారు గోపాల్ రెడ్డి ఇప్పటికీ ఐసీయూలోనే ఉన్నారు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి పై కారం చల్లడం, వాహనం దగ్ధం చేయడానికి సంబంధించి 20 మందిపై కేసులు నమోదు చేశారు.

12 ద్విచక్ర వాహనాలు, ఆటో స్వాధీనం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మాచర్ల మండలం జమ్మల మడగలో శుక్రవారం ఎస్ఐ రాజశేఖర్ సిబ్బం దితో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీసు ఉన్న తాధి కారుల ఆదే శాలతో గ్రామంలో తనిఖీలు చేయగా సరైన పత్రాలు లేనటువంటి 12 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటో లభ్య మైందన్నారు. తక్షణమే వాటిని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే, గ్రామంలో అనుమానిత గహాలలో తనిఖీలు చేసామన్నారు. గృహాలలో మారణా యుధాలు, పెట్రోల్ విక్రయించిన, గొడవలకు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గారపాడులో పోలీస్ తనిఖీలు

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని గార పాడులో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహిం చారు. ఆ గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలలో ఎస్సై వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.

కాకాని బాజి బాబా దర్గాలో దువా

ప్రజాశక్తి - వినుకొండ

ఆంధ్రప్రదేశ్ ముఖ్య మంత్రిగా నారా చంద్ర బాబు నాయుడు కావా లని, నరస రావుపేట ఎంపిగా లావు శ్రీకృష్ణ దేవరాయలు, వినుకొండ ఎమ్మెల్యేగా జి.వి. ఆంజనేయులు అత్యధిక మెజారిటీతో ఘన విజయం సాధించాలని మైనారిటీ నాయకులు ఆకాంక్షిస్తూ స్థానిక కాకాని బాజీ బాబా దర్గాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు . గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఆగిన అభివృద్ధి తిరిగి ప్రారంభం కావాలని, అమరావతి రాజధాని నిర్మాణం జరగాలని కోరు కున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ జానీ, మైనార్టీ నాయకులు అహ్మద్ సన, జిల్లా తెలుగు యువత సోషల్ మీడియా కోఆర్డినేటర్ షేక్ ఫరూక్, పట్టణ టి ఎన్ ఎస్ ఎఫ్ అధ్యక్షుడు షేక్ ఖాజ, మైనార్టీ నాయకులు రఫీ, అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు.

కౌంటింగ్ రోజైనా భద్రతకు ఈసీ భరోసా ఇవ్వాలి

టిడిపి నాయకులు జీవీ ఆంజనేయులు

ప్రజాశక్తి - వినుకొండ

పోలింగ్ రోజు, అనంతర హింసాత్మక ఘటనల అనుభవాల నేపథ్యంలో కౌంటింగ్ రోజైనా భద్రతకు ఎన్నికల సంఘం, పోలీస్ వ్యవస్థ భరోసా ఇవ్వాలని వినుకొండ అసెంబ్లీ నియోజకవర్గం ఎన్డీఏ కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా డిమాండ్ చేశారు. మరీ ముఖ్యంగా పల్నాడు జిల్లా సహా సమస్యాత్మక ప్రాంతాల్లో ఈసీ ఇప్పటి నుంచే చర్యలు తీసుకోకపోతే అధికార వైసీపీ రౌడీ మూకలు చెలరేగిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారాయన. రాష్ట్ర వ్యాప్తంగా విధుల నుంచి తప్పించమని కోరుతున్న రిటర్నింగ్ అధికారు విజ్ఞప్తులు, వేడుకోలులే అందుకు నిదర్శనమని వ్యాఖ్యా నించారు. అధికార వైసీపీ అరాచకాలకు తీవ్ర భయాందోళనల్లో ఉన్నారడానికి తాడిపత్రి రిటర్నింగ్ అధికారి సెలవుపై వెళ్లడం కంటే ఉదాహరణ ఏం కావాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15 మందికి పైగా ఆర్వోలు అదే గోడు వెళ్లబోసుకుంటున్నారంటే వారిని వెసిపి ఏ స్థాయిలో భయపెడుతుందో, బెదిరిస్తుందో, ఒత్తిళ్లు తెస్తుంద అర్థం చేసుకోవచ్చన్నారు. అనేక జిల్లాల కలెక్టర్లకు ఇదే విషయంలో రిటర్నింగ్ అధికారుల నుంచి వస్తోన్న వినతుల పరంపరను ఈసీ పరిశీలించినా సమస్య తీవ్రత అర్థమవుతుందన్నారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తి చేయడంలో అత్యంత కీలకమైన రిటర్నింగ్ అధికారులకే ఈ దుస్థితి ఉంటే ఇక ఎన్నికల సంఘం, పోలీసులు ఏం చేస్తున్నారనుకోవాలని ప్రశ్నించారు. వైసిపి నేతలు ఈ స్థాయిలో బెదిరింపులకు పాల్పడుతున్నారని వెలుగు చూసినా ఇంకా చర్యల విషయంలో ఎందుకు ఉపేక్షిస్తున్నారని ప్రశ్నించారు. ఎన్నికల సంఘం పరువు తిరిగి రావాలన్నా, పోలీ సులు ప్రజా సేవకులుగా పనిచేస్తారని నమ్మకం కలగాలన్నా కౌంటింగ్ రోజు ఒక్క చిన్న అవాంఛనీయ ఘటనకు కూడా ఆస్కారం లేకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరారు.

పొలం డాక్యుమెంట్ పోయినది

సంకు పున్నమ్మకు చెందిన పొలం డాక్యుమెంట్ పోయినది. డోకిపర్రు గ్రామ రెవెన్యూ పరిధిలోని పొలం సర్వే నెంబర్ 66/3, 1457/2002 లోని 94 సెంట్లు పొలానికి సంబంధించిన డాక్యుమెంట్ 10-12-2023 తేదీన గుంటూరు బ్రాడీపేట నుండి పట్టాభిపురం ఆటోలో వెళుతుండగా జారి పడిపోయినది. దొరికిన వారు కింది అడ్రస్ లో ప్రదించగలరు.

సంకు పున్నమ్మ,
బ్రాడీపేట, గుంటూరు
సెల్ :9985237971

పొలం డాక్యుమెంట్ పోయినది

గట్టు చిన ఆనందరావు, (తండ్రి) గట్టు నాగేశ్వరరావు కు చెందిన పొలం డాక్యుమెంట్ పోయినది. మంగళగిరిపాడు గ్రామపంచాయతీ తురకపాలెం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 29/A లోని పొలం 0.40 సెంట్లు పొలం డాక్యుమెంట్ ది.7-2-2024 న బ్రాడీపేట నుండి పట్టాభిపురం వైపు ఆటోలో వెళుతుండగా జారి పడిపోయినది. దొరికిన వారు కింది అడ్రస్ లో సంప్రదించగలరు.

గట్టు చిన ఆనందరావు,
బ్రాడీపేట, గుంటూరు.
సెల్: 6301564156

అమ్మకాలు తగ్గాయి..

- **పట్టణంలో చెరకురసం వ్యాపారులు**
- **రోజంతా కష్టపడ్డా ఉపయోగం లేదు**

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రోజంతా కష్టపడిన రోజువారీ కూలి కూడా రావడం లేదని పట్టణంలో చెరకురసం అమ్ముకునే వారుచెబుతున్నారు. అన్నింటికీ రేట్లు పెరిగి పోయాయని దానికి తోడు పన్నుల రూ పంలో మున్సిపా లిటీ వారికి నెలకు రూ.300 నుంచి రూ.400 కట్టాల్సి వస్తోందని చెబుతున్నారు. పట్టణంలోని అన్ని సెంటర్లలో కలిపి మిషన్ల ద్వారా చెరకు రసం విక్రయించే వారి సంఖ్య 25 నుంచి 30 వరకు ఉంటుంది. వాటిపై ఆధారపడి పనిచేసే వారి సంఖ్య వంద నుంచి రెండు వందల వరకు ఉంటుంది. ఒక్కో మిషన్ వద్ద ఇద్దరు లేదా ఒకే కుటుంబంలోని ముగ్గురు వ్యక్తుల వరకు పనులు చేస్తుంటారు. ఏడాది మొత్తంలో కనీసం 120 రోజులు ఈ చెరకురసం పనులు ఉంటాయని, మిగిలిన సమ యంలో ఇతర పనులకు వెలుతుంటామని వాటి వద్ద పని చేసే వారు చెబుతున్నారు.

ఒకప్పుడు సగానికి సగం మిగిలేది

చెరకురసం వ్యాపారి వెంకట్రావు మాట్లాడుతూ చెప్పాలంటే గతంలో రోజుకి వెయ్యి నుండి పదిహేను వందల గ్లాసుల చెరకురసం, ఒక్కో గ్లాసు పది రూపాయలు చొప్పున విక్రయించే వాళ్లం. సగానికి సగం మిగిలేది.ప్రస్తుతం గ్లాస్ రూ.20 చొప్పున విక్రయిస్తుంటే అమ్మకాలు తగ్గిపోయాయి. రోజు మొత్తం ఐదు వందల గ్లాసులు కూడా అమ్మ లేని పరిస్థితి. కూలి పాటు కూడా రావడం లేదు. అందులోనూ ఉదయం అసలు అమ్మకాలు ఉండవని మధ్యాహ్నం 12 గంటల తర్వాతే బేరాలు ఉంటాయని, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు అమ్మ కాలు జరుగుతుంటాయి.

అద్దె కడుతున్నాం

చెరకు రసం విక్రయించే లక్ష్మీ మాట్లాడుతూ గతంలో చెరకు రసం తీసే మిషన్ రూ.50,00 నుంచి రూ.60,000 వేలకు లభించేవి. ప్రస్తుతం వాటి ధర లక్ష రూపాయలు చెబుతున్నారు. ఒకప్పుడు చెరకు టన్ను ధర రూ.5,500 నుంచి రూ.6,000 ఉండేది. ప్రస్తుతం దాని ధర రూ.10,000.

గతంలో వ్యాపార దుకాణాల ముందు చెరకురసం విక్ర యించేం దుకు ఆయా దుకాణాల వారు కొంత మంది ఉచితంగా పెట్టుకోనిచ్చేవారు. ప్రస్తుతం అద్దె కట్టాల్సి వస్తోంది. విద్యుత్ ఛార్జీలతో సహా నెలకు రూ. 6,000 నుంచి రూ.7,000 వరకు చెల్లిస్తు న్నాం. చెరకురసంలో ఉపయోగించే నిమ్మకాయలు, అల్లం ధరలు కూడా బాగానే ఉంటున్నాయి. ఒక్కో నిమ్మకాయ ధర రూ.5 ఉంటోంది. కిలో అల్లం అల్లం ధర రూ.200 ఉంది. ఐస్ ధర గతంలో రూ.30 ఉండేది. ప్రస్తుతం రూ.70 వరకు అమ్ము తున్నారని, గ్లాసుల ధరలు 0.75 పైసల నుంచి రూ.1.50 పెంచారు. మున్సిపాలిటి వారికి రోజుకి పది రూపా యలు కట్టాల్సి వస్తోందని, దీనికి తోడు చెరకు పిప్పిని తీసుకెళ్లినందుకు నెలకు రూ. 300 చెల్లిస్తున్నాం.

చెరకును కూడా వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘాల సొసైటీ లకు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని చెరకు రసం విక్ర యించే వారు కోరారు. వారి ద్వారా తక్కువ రేట్లకు కొనుగోలు చేసి సౌకర్యం కల్పించా లంటున్నారు. చెరుకురసం అమ్ము కునే వారందరికి వడ్డీలు లేని బ్యాంకు రుణలు ఇప్పించాలని, ము న్సిపాలిటీ వారి చెత్త పన్ను, కాంట్రా క్టు విధానంలో వసూలు చేసే పది రూపాయల మినహాయింపు ఇవ్వాలని కోరు తున్నారు.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT NARASARAOPET/PALNADU DISTRICT.
DISPUTE No. 109 / 2023

Between:
M/s Dhana Lakshmi Srinivasan Chit Funds (Andhra) Pvt.Ltd.,
Narasaraopet Branch, Rep.by its Manager / Foreman ...Disputant
Vs.
Mr.sk.karimulla & Others ...Opponents
Opponent No 3. Mr.Pagilla Srinivasa Rao, S/o P.Kotaiah, Aged 52 Years, Attender, Div.Co-Op Office, Collectorate Compound, Guntur. Residing at D.NO. 7-6-366/3A, 2/2 Vasantha raya puram Guntur.

Please take notice that the above Dispute is filed against Opp. No.3 of you and Four others for recovery of Rs. 3,81,982/- (Rupees Three Lakhs Eighty One Thousand Nine Hundred and Eighty Two Only) and the same is posted on 22-06-2024 for the appearance of you before the Hon'ble Deputy Registrar of Chits, Narasaraopet at 10-30 AM either in person or through an Advocate. If you fail on that day the matter will be heard and decided Ex-parte basis on the material available.

(By the order of the Deputy Registrar of Chits)
Dhanalakshmi Srinivasan Chit Funds (Andhra) Pvt. Ltd., Narasaraopet
Rep/by it's Branch Manager

మహారాజశ్రీ మార్కాపురం 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో
ఎం.వి.ఓ.పి. నెం: 43/2019

దుగ్గినేని వెంకటసుబ్బులు ... వాది
వర్సెస్
ముప్వా హనుమంతరావు మరియు ఆరుగురు ఇతరులు .... ప్రతివాదులు
టు,
ఆర్3.
తుమ్మపూడి పిచ్చిరెడ్డి, తండ్రి: సీతారామిరెడ్డి
నివాసం: డోర్ నెం: 2-63, కంటెపూడి,
సత్తెనపల్లి టౌన్ అండ్ మండలం, పల్నాడు జిల్లా.

పైన తెలిపిన ఎం.వి.ఓ.పి. 43/2019 నందు 3వ ప్రతివాది అయినటువంటి తుమ్మపూడి పిచ్చిరెడ్డి పై కోర్టు నందు పిటీషన్ దాఖలు చేసి పలుమార్లు బత్తా కట్టియున్నారు. అయిననూ 3వ ప్రతివాది కోర్టుకు హాజరుపడి ఉండలేదు. దరిమిలా పై కేసును 10-07-2024వ తేదీన వాయిదా వేసియున్నారు. కావున ఆ తేదీన ఉదయం 10:30 గంటలకు శ్రీయుత కోర్టు వారి ఎదుట నీవు గానీ, నీ తరపు అడ్వకేట్ ద్వారా గానీ హాజరై ఏదైనా ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకొనవలసినది. లేని యెడల నీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా : 10-07-2024
మార్కాపురం **మధిరె మల్లికార్జునరెడ్డి**
అడ్వకేట్, మార్కాపురం.

తన ఇంట్లో నేలపై పడుకుని నిరసన తెలుపుతున్న అరవిందబాబు

నన్నూ అరెస్టు చేయండి : అరవిందబాబు

ప్రజాశక్తి - నరసరావుపేట

పోలింగ్ రోజు జరిగిన అల్లర్ల కేసులకు సంబంధించి పలువురు టిడిపి కార్యకర్తలను అక్రమంగా అరెస్ట్ చేశారని ఆ పార్టీ నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తన నివాసంలోనే చేపట్టిన దీక్ష కొనసాగుతోంది. నాలుగో రోజైన శుక్రవారం అరవిందబాబు తన ఇంట్లో నేలపై పడుకుని నిరసన కొనసాగించారు. దాడులకు పాల్పడిన వైసిపి వారిని అరెస్టు చేయకుండా టిడిపి, బిజెపి, జనసేన కార్యకర్తలనే అరెస్టు చేస్తున్నారని ఆరోపించారు. వారిని వెంటనే విడుదల చేయాలని, నిజంగా అల్లర్లకు పాల్పడిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఈ రెండూ చేయలేని పక్షంలో తననూ అరెస్టు చేయాలని అన్నారు.

ఉపాధ్యాయులు బలిపశువులయ్యారు

ప్రజాశక్తి - రెంటచింతల

ఎన్నికల విధులు నిర్వహించడానికి వచ్చిన ఉపాధ్యాయులను బలి పశువులు చేసి డిపిఒ స్థాయి అధికారులు సేఫ్‌గా ఉన్నారని ఉపాధ్యాయ సంఘాల నేతలు మండిపడుతున్నారు. సమాజ ప్రగతి తప్ప ఇతర వ్యాపకాలు లేని ఉపాధ్యాయులను సస్పెన్షన్‌కు గురిచయడం బాధాకరమన్నారు. 30 ఏళ్లపాటు వివిధ ప్రభుత్వ కళాశాలల్లో మ్యాథమెటిక్స్ లెక్చరగా పనిచేసిన సుబ్బారావు, టీచర్ షహనాజ్‌ను సీసీ ఫుటేజ్ ఆధారంగా చర్యలు తీసుకోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. వెబ్ కాస్టింగ్ అంతా చూసేది ఏడు సంవత్సరాల నుంచి పనిచేస్తున్న ఓ అధికారికి, ఆపై అధికారులని, అయితే నెపమంతా పిఒ, ఎపిఓలపై తోయడం దేనికి సంకేతమని ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల గొడవలకు టీచర్ల కుటుంబాలను బాధ్యులుగా చేయడం సమంజసం కాదని అంటున్నారు.

జంగాలపల్లిలో పోలీసులు తనిఖీలు

ప్రజాశక్తి - వినుకొండ

నూజెండ్ల మండలం జంగాలపల్లిలో ఐనవోలు పోలీసులు ఎస్ఐ లక్ష్మీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం కార్డెన్‌సెర్చ్ చేపట్టారు. పోలింగ్ అనంతరం మండలం లోని పలు గ్రామాల్లో అల్లర్లు, ఘర్షణలు జరిగిన దృష్ట్యా అవి పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. మారణాయుధాలు, నాటు బాంబులు ఉన్నాయెమోననే అనుమానంతో ప్రతి ఇంటినీ తనిఖీ చేస్తూ ఊరిని జల్లెడ పట్టారు. అయితే ఏమీ లభ్యం కాలేదని పోలీసులు ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పోలీసులు పలు సూచనలు ఇచ్చారు. అల్లర్లకు దూరంగా ఉండాలని, వివాదాల జోలికెళ్తే కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు. గొడవల్లో పాల్గొని జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు.

విత్తనం.. ఎంఆర్‌పికి అమ్మబోం..

- ముద్రణ ధరపై రూ.350 వరకూ అధికంగా వసూలు
- ప్రముఖ కంపెనీల పేరుతో కృత్రిమ కొరత సృష్టికి యత్నం
- పత్తి విత్తనం విషయంలో దోపిడీకి గురవుతున్న రైతు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

అధిక ధరలకు విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని అధికారులు పదేపదే ప్రకటిస్తున్నారు.. వ్యాపారులు మాత్రం అధిక ధరలకు మినహా ఎంఆర్‌పికి విత్తనాలు అమ్మబోమని తమ చర్యల ద్వారా నిరూపిస్తున్నారు.. వెరసి మధ్యతో రైతు నష్టపోతున్నాడు.

మార్కెట్‌లో లభించి ప్రముఖ కంపెనీల పత్తి విత్తన ధరలను వ్యాపారులు అధిక ధరలకు అమ్ముతున్నారు. 450 గ్రామాలుంటే ప్యాకెట్ ధర రూ.1200 వరకూ వసూలు చేస్తున్నారు. పైగా రైతులు అడిగిన కంపెనీల విత్తనాలు అడిగితే అవికాకుండా మరోరకం ఇస్తున్నారనే ఆరోపణలూ వస్తున్నాయి.

మరో 40-45 రోజుల్లో పత్తి సాగు ప్రారంభం కానుంది. వర్షాలు ఆలస్యమైతే జులై ఆఖరు వారం లేదా ఆగస్టు మొదటి వారంలోనూ సాగు చేస్తుంటారు. ఈలోగా పొలాన్ని సాగుకు సిద్ధం చేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. దీంతోపాటు సీజన్ పూర్తిగా ప్రారంభం అయితే డిమాండ్ పేరుతో విత్తన ధరలు పెరుగుతాయని కొంతమంది రైతులు ఇప్పుడే కొనుగోలు చేస్తున్నారు. అయితే వ్యాపారులు తమ ధరల దోపిడీని ఇప్పటికే మొదలుపెట్టారు.

ఇతర సాధారణ కంపెనీల విత్తనాలను ఒక్కో ప్యాకెట్ ధర ప్రస్తుతం రూ.850 చెబుతున్నారు. 2020-21లో ఇది రూ.680గాను, 2022-23లో రూ.730 వరకు ఉండగా, గతేడాది రూ.850 అమ్మారు. ఇప్పుడు రెండు మూడు ప్రముఖ కంపెనీల విత్తనాల ధరలు సహా అన్ని కంపెనీల విత్తనాలు ఇదే మోతాదులో ధరున్నా వ్యాపారులు మాత్రం రైతుల్లో ఉన్న డిమాండ్‌ను సొమ్ము చేసుకునేందుకు రూ.1200 వరకూ వసూలు చేస్తున్నారు. సాధారణంగా ఎకరా పత్తిసాగుకు ఒకటిన్నర నుండి రెండు ప్యాకెట్లు అవసరమవుతాయి.

మండలంలో గతేడాది 2000-2500 ఎకరాల వరకూ పత్తి సాగైంది. ఈ ఏడాది కూడా ఇదే విస్తీర్ణంలో సాగయ్యే అవకాశం ఉంది. సాగు పెరగకపోయినా విత్తనాల ధరలు ఎందుకు పెంచారనేది రైతుల నుండి వస్తున్న ప్రశ్న. పైగా పంట ధరలూ గతంతో పోలిస్తే పెరగలేదని, నాణ్యమైన పత్తి క్వింటాళ్ రూ.5,500-6,000 లోపే ఉందని, ఎకరాలకు 8-10 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతులు చెబుతున్నారు. సాగులో అనూహ్యమైన మార్పులేమీ లేకుండా విత్తనాల ధరలు మాత్రం ఆమాంతంగా పెంచుతున్నారని, ఎంఆర్‌పికి అమ్మేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. అయితే ఈ పరిస్థితిపై అధికారులను సంప్రదించగా ఎన్నికల కోడ్ ముగిసే వరకూ తామేమీ స్పందించబోమని వారి నుండి ప్రతిస్పందన వస్తోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలను సబ్సిడీకి సరఫరా చేయాలని రైతు నాయకులు కోరుతున్నారు.

కావూరులో దుక్కులు పూర్తయిన పొలం

లైసెన్స్ ఉన్న విత్తనాలన్నీ మంచివే : ఎడిఎ

- కృత్రిమ కొరత సృష్టించినా, ఎంఆర్‌పికి మించి అమ్మినా కఠిన చర్యలు
- కొనుగోలు రసీదును తప్పకుండా తీసుకొని దాచుకోండి
- విత్తన దుకాణాల్లో కొనసాగిన తనిఖీలు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రైతులు సాగుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో వారికవసరమైన విత్తనాల నిల్వలను అందరికీ సరిపడే మోతాదులో అందుబాటులోకి రానున్నాయని నరసరావుపేట డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఎడిఎ) పి.మస్తానమ్మ తెలిపారు. బుధ, గురువారాల్లో నరసరావుపేట పట్టణంలోని పలు విత్తన దుకాణాల్లో చేపట్టిన తనికీలు శుక్రవారమూ కొనసాగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న పంటలకు సంబంధించిన విత్తన ప్యాకెట్లను బ్లాక్ మార్కెటింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పత్తి విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరకు లోబడి మాత్రమే విక్రయించాలని వ్యాపారులను ఆదేశించారు. రైతులు ఒకే రకం విత్తనాలు అడుగుతున్నారనే కారణంతో ఆ విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక కంపెనీకి చెందిన విత్తనాలు మాత్రమే కావాలని పట్టు పట్టడం కూడా రైతులకు శ్రేయస్కరం కాదన్నారు. దీనివల్ల మార్కెట్లో ఆ బ్రాండ్‌ను కృత్రిమ కొరత ఏర్పడుతుందని అన్నారు. వ్యవసాయ శాఖ లైసెన్సు పొందిన డీలర్ల వద్ద లభించే అన్ని రకాల విత్తనాలు నాణ్యమైనవే ఉంటాయని సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన సందర్భంలో రసీదును తప్పనిసరిగా పొందాలని, వాటిని పంటకాలం పూర్తయ్యే వరకు జాగ్రత్తగా దాచుకోవాలని రైతులకు సూచించారు.

విత్తన దుకాణాల్లో రికార్డులను పరిశీలిస్తున్న ఎడిఎ

గ్లైసిల్ బిటి పత్తి విత్తనాలు విక్రయాలు నిషేధం

ప్రభుత్వం నిషేధించిన గ్లైసిల్ బిటి పత్తి విత్తనాలు నిల్వలు కలిగి ఉన్నా, సాగు చేసినా రైతులపై సైతం చర్యలు తీసుకుంటామని ఎడిఎ స్పష్టం చేశారు. గ్లైసిల్ బిటి పత్తి సాగు వల్ల భూమి, పర్యావరణం కలుషితమవుతున్నాయని, ప్రజారోగ్యంపై ప్రభావం చూపించే అవకాశం ఉందని చెప్పారు.

అధికారుల అలసత్వం.. జనాలకు జరిమానా

ప్రజాశక్తి - పెదకూరపాడు

పెదకూరపాడు నియోజకవర్గంలో భూములను 2016లో ఆన్లైన్లో చేశారు. అప్పటి అధికారులు హడావుడి, అలసత్వం వల్ల ఇప్పుడు ప్రజలు ఏళ్ల తరబడి కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు. ఒకే సర్వే నంబర్‌లో దేవాదాయ భూములు, చెరువు పోరంబోకు, పట్టా భూములుంటే వాటన్నింటినీ దేవాదాయ భూములుగా, చెరువు పోరంబోకు భూములుగా నమోదు చేశారు. అప్పటినుండి ప్రజలకు భూ సమస్యలు మొదలయ్యాయి.

క్రోసూరులో 594-ఎ2 సర్వే నంబర్లు 484 ఎకరాల్లో కొండ, చెరువు, గ్రామము ఉంటుంది. అందులో కొండ ప్రాంతం 23 ఎకరాల్లో ఇళ్లున్నాయి. ఆన్లైన్ నమోదు చేసినప్పుడు మొత్తాన్ని చెరువు పోరంబోకుగా చూపించడంతో వెయ్యి కుటుంబాలు పైన ఉన్న స్థానికులు అవస్థ పడుతున్నారు. ఇల్లు అమ్మాలన్న, కొనాలన్నా లావాదేవీలు జరిగే పరిస్థితి లేదు. విద్యా అవసరాలకు, ఇతర అవసరాలకు బ్యాంకులో తాకట్టుపెట్టి అప్పు తెచ్చుకోవాలన్న వీలు కావడంలేదు. చెరువు పోరంబోకుగా 22ఎలో నమోదైంది. ఆ ప్రాంతంలోని ఇల్లు అమ్ముకోవాలంటే పక్క సర్వే నంబరు వేసి రిజిస్ట్రేషన్ చేయించుకునే పరిస్థితి నెలకొంది. దీనివల్ల భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉన్నది. సవరణ దస్తావేజు ద్వారా సర్వే నంబరు మార్చుకుంటే రుసుము చెల్లించవలసి ఉంటుంది.

2017 నుండి ఈ సమస్య పరిష్కారం కోసం ఆ ప్రాంతవాసులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. 2022లో అఖిలపక్ష స్థాయిలో కమిటీగా ఏర్పడి ఎమ్మెల్సీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. అప్పటినుండి 594ఎ2ను 594ఎ2ఎగా మార్చాలని నిర్ణయించారు. సబ్ డివిజన్ నంబరు ఇచ్చినా రాష్ట్రస్థాయిలో సీసీఎల్‌ఎ కార్యాలయం నుంచి అనుమతులు మంజూరు కాలేదు. ఎనిమిదేళ్ల నుంచి పోరాటం చేస్తున్న ఇంకా పరిష్కారం కాలేదని కొండ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ ఏళ్ల తరబడి తిరుగుతున్నా

ఇంటిని అమ్ముకోవాలంటే తక్కువ ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. 2017 నుంచి పోరాటం చేస్తుంటే చెరువు పోరంబోకు, నివాస గృహాలకు ప్రత్యేక నంబర్లు ఇచ్చి సబ్ డివిజన్ మాత్రమే చేశారు. రాష్ట్రస్థాయిలో ఇంకా ఆమోద ముద్ర పడలేదన్నారు.

ఆదిరెడ్డి, స్థానికులు.

అధికారులు చేసిన చిన్న పొరపాటుకు క్రోసూరు కొండ కింద ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ కార్యాలయాలను చుట్టూ తిరుగుతున్న పెండింగ్ దశలోనే ఉంది. భూమి అమ్ముకునేవారు పెద్ద ఎత్తున నష్టపోతున్నారు. అత్యవసరమైతే తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తోంది.

టి.హనుమంతరావు, కెవిపిఎస్ నాయకులు.

సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. తొలిరోజు ప్రశాంతంగా జరిగాయి. తెలుగు పరీక్షకు లజిల్లా వ్యాప్తంగా 1914 మంది విద్యార్థులకుగాను, 776 మంది హాజరవగా, 1138 మంది గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఉదయం ప్రథమ సంవత్సరం పరీక్షలకు 36 కేంద్రాల్లో పరిక్ష జరిగింది.5550 మందికిగాను 5208 హాజరు అవగా, 342 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 12 పరీక్షా కేంద్రాల్లో జరిగిన పరీక్షలకు 594 మందికిగాను 526 హాజరు కాగా, 68 మంది గైర్హాజరయ్యారు.

డిఇఇ సెట్ ప్రశాంతం

డిప్లోమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డిఇఇ) సెట్ పరీక్ష జిల్లాలో శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. 384 మందికిగాను 330 మంది హాజరయ్యారు. 54 మంది గైర్హాజరయ్యారు.

భవనం నిర్మించారు.. ప్రారంభం మరిచారు..

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని ప్రాంతం రాయపూడి గ్రామంలో ఈ - హెల్త్, వెల్ నెస్ సెంటర్ (బహుళార్ధ సాధక ఆరోగ్య ఉపకేంద్ర భవనం) ప్రారంభానికి నోచుకోవడం లేదు. రూ148.12 లక్షల వ్యయంతో నిర్మించి ప్రారంభం మరిచారని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. గత ఏడాది ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి వై శ్రీ లక్ష్మీ,సి ఆర్ డి ఎ అడిషనల్ కమిషనర్ కట్టా సింహాచలం ఈ హెల్త్, వెల్ నెస్ సెంటర్‌ను పరిశీలించారు. భవనం నిర్మాణం బాగుందని కితాబిచ్చారు.దీంతో సెంటర్ ప్రారంభంతో పాటు అవసరమైన వైద్యులు, సిబ్బంది నియామకం జరుగుతుందని స్థానికులు భావించారు.కానీ నెలలు గడిచినా ఈ హెల్త్ సెంటర్ నిర్మాణం ఊసు లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. భవనంతో దాతలు ఇచ్చిన అంబులెన్స్ కూడా నిరుపయోగంగా మారిందని వాపోతున్నారు. ఈ హెల్త్, వెల్ నెస్ సెంటర్ అందుబాటులోకి వస్తే రాయపూడితో పాటు అబ్బురాజుపాలెం, బోరుపాలెం, హరిశ్చంద్రపురం, లింగాయపాలెం, ఉద్దండ రాయునిపాలెం గ్రామస్తులకు వైద్య, ఆరోగ్య పరమైన సేవలు అందే వీలు కలుగుతుంది. ప్రభుత్వం, అధికారులకు భవనాల నిర్మాణంలో ఉన్న శ్రద్ధ ప్రారంభం,వైద్యులు,సిబ్బంది నియామకంలో ఉండడం లేదని,కేవలం కమిషన్ ల కోసమే భవనాల నిర్మాణం చేస్తున్నట్లుగా కనబడుతోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న తుళ్లూరులో కూడా సుమారు రూ కోటిన్నర వ్యయంతో ఈ హెల్త్, వెల్ నెస్ సెంటర్ నిర్మాణం జరుగుతోంది. రూ కోట్లు ప్రజాధనం హెచ్చించి భవనాలు నిర్మించి ప్రారంభించక పోవడంపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు ఇవ్వాలి

రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్నా శివశంకరరావు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఖరీఫ్ సీజన్ మొదలవుతున్న తరుణంలో రైతులకు రైతు భరోసా కేంద్రాల నుండి సబ్సిడీపై జీలగ, జనుము, పిల్లిపేసర వంటి పచ్చి రొట్టను అందజేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు అన్నారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు రైతు భరోసా కేంద్రాన్ని రైతు నాయకులతో కలిసి, సందర్శించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ ముందుగానే ఈ ఖరీఫ్ సీజన్లో రైతులు తమ పంట పొలాలలో భూమి సారాన్ని పెంపొందించుకునేందుకు, ప్రతి రైతుకు పచ్చిరొట్ట అందజేయాలన్నారు. ఆర్‌బికెల్లో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, రైతు నాయకులు బొప్పన గోపాలరావు, పల్లపాటి సుబ్బారావు, వ్యవసాయ కార్మిక సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు పరిమిశెట్టి శివ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దశాబ్ధాలుగా శిథిలావస్థలో ఆయుర్వేద వైద్యశాల

ప్రజాశక్తి - పొన్నూరు

గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించటానికి పొన్నూరు మండలం తాళ్లపాలెం గ్రామంలో ప్రముఖ స్వాతంత్ర సమరయోధుడు జీయర్ దాస్ సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ భవనం నిర్వహణ, మరమ్మతులు కొరవడి నేల కూలటానికి సిద్ధంగా ఉంది. దీంతో తాళ్లపాలెం పరిసర ప్రాంతాలలోని గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేని రోజుల్లో జీయర్ దాస్ తాళ్లపాలెం గ్రామంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలను ఏర్పాటు చేశారు. ఈ వైద్యశాలలో మెడికల్ ఆఫీసర్‌తో పాటు సిబ్బందిని కూడా ఏర్పాటు చేశారు. ఈ వైద్యశాలను 1976లో అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి జలగం వెంగళరావు, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కొత్త రఘురామయ్య, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి చేబ్రోలు హనుమయ్య, పార్లమెంటు సభ్యులు అంకినీడు ప్రసాద రావు ప్రారంభించారు. ఆ తర్వాత 1979లో పొన్నూరు పంచాయతీ సమితి రెగ్యులర్ ఆయుర్వేద డిస్పెన్సరీగా అప్గ్రేడ్ చేసి అప్పటి ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎం భాగారెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి ఎడ్లపాటి వెంకట్రావు ప్రారంభించారు. తాళ్లపాలెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలకు పరిసర ప్రాంతాల నుంచి ఎంతో మంది వైద్య సేవలు కోసం ఇక్కడికి వస్తుండేవారు. అయితే ఈ వైద్యశాల శిథిలమై సౌకర్యాలు కలవడంతో ఇక్కడికి వచ్చే రోగుల సంఖ్య కమిటీ తగ్గింది. సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ఆయుర్వేద వైద్యశాల భవనంకు ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంతో నేలకూలడానికి సిద్ధంగా ఉంది. వైద్యశాల భవనంలో రోగులకు వైద్య సేవలు అందించడానికి ఎప్పుడు కూలుతుం దోనని సిబ్బంది సైతం భయభ్రాంతు లవుతున్నారు. సిబ్బందికి రోగులకు అవసరమైన మరుగుదొడ్లు, సౌకర్యాలు, వసతులు లేకపోవడంతో తీవ్ర ఇక్కట్లు గురవుతున్నారు. ఈ వైద్యశాలలో గత కొన్ని సంవత్సరాలుగా మెడికల్ ఆఫీసర్ లేకపోవడంతో వల్లవ రావుపాలెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల మెడికల్ ఆఫీసర్ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఈ వైద్యశాలలో సిబ్బంది కొరత కారణంగా రోగులు సంఖ్య తగ్గుముఖం పట్టింది.

నూతన భవన నిర్మాణానికి నివేదించాం

డాక్టర్ కోటేశ్వరరావు, మెడికల్ ఆఫీసర్, తాళ్లపాలెం

తాళ్లపాలెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల భవనం శిథిలంగా మారింది. దాని స్థానే నూతన భవన నిర్మాణం కోసం ఆంధ్రప్రదేశ్ ఆయుష్ శాఖకు ప్రతిపాదనలు లేఖల ద్వారా నివేదించాం. ప్రభుత్వం నిధులు మంజూరు కాగానే నూతన ఆయుర్వేద వైద్యశాల భవన నిర్మాణం పనులు ప్రారంభించడం జరుగుతుంది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - తుళ్లూరు : రాజధాని అమరావతి లోని 33/కెవి మందడం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని ఏడు గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ వి ఉమా మహేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మందడం, వెంకటపాలెం, మల్కాపురం, వెలగపూడి, ఉద్దండ రాయుని పాలెం, తాళ్లాయపాలెం, మందడం టిడ్కో గృహ సముదాయాలు, ఐనవోలు లో విద్యుత్ సరఫరా ఉండదని ప్రకటనలో పేర్కొన్నారు. మరమ్మతులు కారణంగా ఆయా గ్రామాల్లో ఉదయం గం. 8 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అధిక మైలేజీ సాధించిన డ్రైవర్‌కు ప్రశంస

ప్రజాశక్తి - తెనాలి

డ్రైవర్ భూషణాన్ని అభినందిస్తున్న డిఎం రాజశేఖం

డిపోలో అధిక కేఎంపిఎల్ సాధించిన డ్రైవర్ కె భూషణం ను రీజనల్ మేనేజర్ అభినందించారని డిపో మేనేజర్ రాజశేఖర్ తెలిపారు. స్థానిక డిపో ఆవరణలో శుక్రవారం భూషణంను డిఎం అభినందించారు. రీజనల్ మేనేజర్ పంపిన ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎస్6 వాహనానికి లీటర్ డీజిల్ కు కు 6.03 కిలోమీటర్ల మైలేజి భూషణం సాధించారన్నారు. ఇది డిపో ఆదాయానికి మెరుగైన వనరుగా చెప్పారు. మిగిలిన సిబ్బంది కూడా ఇదే స్ఫూర్తితో పని చేయాలని కోరారు. కార్యక్రమంలో డ్రైవర్లు, డిపో సిబ్బంది ఉన్నారు.

జీవవైవిధ్య పరిరక్షణకు పాటుపడాలి

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం

ప్రజాశక్తి- గుంటూరు

"జీవవైవిధ్యాన్ని జాతీయ సంపదగా భావించాలని, జీవవైవిధ్య చట్టాలను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలని మానవుడు ప్రకృతి విధ్వంసానికి స్వస్తి చెప్పి జీవవైవిధ్య రక్షణకు పాటుపడాలని" అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు పిలుపిచ్చారు. అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో "పటిష్ట చట్టాలతోనే జీవవైవిధ్య మనుగడ" అన్న అంశంపై చర్చ జరిగింది. ఈ కార్యక్రమంలో పర్యావరణ ప్రచారకులు వి. సత్యనారాయణ మాట్లాడుతూ మానవునికి జీవ వైవిధ్యానికి అవినాభావ సంబంధం ఉందని, పెరుగుతున్న జనాభా,

పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వలన సహజ వనరులపై తీవ్ర ఒత్తిడి పెరిగి భూగోళం కాలుష్యానికి గురవుతుందన్నారు. మానవుడు అభివృద్ధి పేరుతో ప్రకృతిని అనేక విధాలుగా ధ్వంసం చేస్తున్నారని ఫలితంగా అసంఖ్యాక జంతు, వృక్ష జాతులు అంతరించి పోతున్నాయన్నారు. మరొకపక్క భూకంపాలు, వరదలు, సునామీలు లాంటి విపత్తులు జీవవైవిద్యానికే పెను సవాలుగా మారుతున్నాయన్నారు. విశ్రాంత జంతు శాస్త్ర శాఖాధిపతి డాక్టర్.ఆర్. రామచంద్రారావు మాట్లాడుతూ 21వ శతాబ్దంలో పర్యావరణ విధ్వంసం, జీవజాతుల నష్టం పట్ల ప్రపంచ దేశాలన్నీ ఆందోళన వెలిబుచ్చుతున్నాయన్నారు. ప్రపంచ దేశాలన్నీ హాజరైన 'కాప్' సమావేశం ఆధునిక జీవవైవిధ్య సవాళ్లను ఎదుర్కొనే దిశగా చర్చించిందని, 2023 డిసెంబర్లో జరిగిన బయోడైవర్సిటీ కాన్ఫరెన్స్ లో 2030 నాటికి జీవవైవిధ్య నష్టాన్ని అరికట్టి పర్యావరణ వ్యవస్థలను పునరుద్ధరించాలని ప్రపంచ దేశాలన్నీ నిర్ణయించాయన్నారు. ఏది ఏమైనా పటిష్టమైన చట్టాలతోనే జీవవైవిద్య మనుగడ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో విద్యావేత్త ముప్పాళ్ళ ప్రసాదరావు, సంస్థ సభ్యులు వి.సి.రెడ్డి తదితరులు ప్రసంగించారు.

ఫుడ్ సేఫ్టీ అధికారినంటూ బెదిరింపులు

వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - తెనాలి

పట్టణంలో ఫుడ్ సేఫ్టీ అధికారులమంటూ వ్యాపారులను ఫోన్లో బెదిరిస్తున్నారని, వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ఈదర వెంకట పూర్ణచంద్ కోరారు. ఓ వ్యక్తి పట్టణంలోని హోటల్స్, స్వీట్ షాప్‌లకు ఫోన్ చేసి లైసెన్సులు తీసుకోవాలని, గతంలో తీసుకుని ఉంటే రెన్యువల్ చేసుకోవాలని, లేకుంటే భారీగా ఫైన్ చెల్లించాల్సి ఉంటుందని బెదిరిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అతను ఫుడ్ సేఫ్టీ స్పెషల్ స్క్వాడ్ సభ్యునిగా చెబుతున్నారని, ఇప్పటికే కొందరి వద్ద నగదును కూడా వసూలు చేశారన్నారు. గత నెలలో కూడా ఇదే తరహాలో వ్యాపారులకు ఫోన్లు రావడంతో పట్టణ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. శుక్రవారం కూడా కొందరు వ్యాపారులకు ఇదే తరహా ఫోన్లు కూడా వచ్చాయని, ఈ నేపథ్యంలో వారు అసోసియేషన్‌ను సంప్రదించినట్లు తెలిపారు. 86396 18189 నంబర్ నుంచి ఫోను వచ్చినట్లు చెప్పారని, వ్యాపారులు తొందరపడి మోసపోవద్దని హెచ్చరించారు. ఘటనపై స్థానిక ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇచ్చామని అలాగే పోలీసులకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు వెంకట పూర్ణచంద్ చెప్పారు.

విజయ హెల్త్‌కేర్ ట్రస్ట్ వితరణ

ప్రజాశక్తి - మంగళగిరి

అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడికి నిత్యవసరుకులను దాతల సహాయంతో విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ స్వాతి గౌడ్ పంపిణీ చేశారు. శుక్రవారం మంగళగిరి నగరంలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి కాలనీ నాలుగో లైన్ లో కొనతల రాఘవయ్య అను వృద్ధుడికి పక్షవాతంతో ఆరోగ్య పరిస్థితి సరిగా లేని కారణంగా జీవనోపాధి కష్టంగా మారడం వల్ల విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఫౌండర్ స్వాతి గౌడ్‌కి వారి పరిస్థితి స్థానికుల సమాచారం

అందచేశారు. ఈ పరిస్థితిని తెలుసుకున్న ట్రస్ట్ ఫౌండర్ స్వాతి గౌడ్ రాఘవయ్యని పరామర్శించి వారి దీన పరిస్థితిని తెలుసుకొని ప్రాథమిక మాధ్యమాల్లో పెట్టగా రాఘవయ్య పరిస్థితి తెలుసుకున్న పెద్దవడ్లపూడి గ్రామానికి చెందిన నల్లబోతుల పుల్లయ్య, విజయలక్ష్మివారి కుమారుడు నల్లబోతుల కిరణ్ హర్ష, నల్లబోతుల సందీప్ కుమార్ స్పందించి రాఘవయ్య కుటుంబానికి నిత్యవసర సరుకులు విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పంపిణీ చేయడం జరిగినది. కార్యక్రమంలో విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ మెంబర్ బొడ్డేటి రమేష్ కాటూరి శ్యామ్ నూతక్కి నాగబాబు, కొండతల వెంకటేశ్వరమ్మ, పేరం నాగమణి తదితరులు పాల్గొనడం జరిగినది.

వైసిపి నేతల గుప్పిట్లోనే ఇసుక రీచ్‌లు

- అనుమతి లేకపోయినా అక్రమ త్రవ్వకాలు
- జిల్లా టిడిపి అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్రస్తుతం వైసిపి నేతల గుప్పిట్లోనే ఇసుక రీచ్‌లు ఉన్నాయని, ఎటువంటి అనుమతులు లేకపోయినా అర్ధరాత్రి సమయంలో ఇసుక అక్రమ తవ్వకాలు చేస్తున్నారని టిడిపి పల్నాడు జిల్లా అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్ ఆరోపించారు. శుక్రవారం నరసరావుపేటలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇసుక రీచ్‌లలో జరుగుతున్న అక్రమ తవ్వకాలను రెవిన్యూ అధికారులు అడ్డుకోవాలని, అనుమతిలేని రీచ్ లను నిలుపదల చేసి ఎన్జీటీ ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు ఆదేశాలు బేఖాతర్ చేస్తూ వైసిపి నేతలు యథేశ్చగా అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నా అధికారులు అడ్డుకోలేక పోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అనుమతిలేని ఇసుక రీచ్ లను నిలుపుదల చేయాల్సి ఉన్నా పెదకూరపాడు నియోజవర్గంలో వైకుంఠపురంలోని నిల్వ యార్డులోని ఇసుక రాత్రికి రాత్రే మాయమవుతోందన్నారు. ఇంత బాహాటంగా జరుగుతున్నా అధికారులు ఇసుక మాఫియాను అడ్డుకోక పోవడంపై రెవిన్యూ అధికారుల తీరు పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ వైసిపి నేతల ఇసుక అక్రమార్జన కొనసాగుతుందన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తున్నవారిపై అధి. కారులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పోస్టర్ విడుదల చేస్తున్న యాదవ సంఘం ప్రముఖ నాయకులు

పది పాసైన విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

ప్రజాశక్తి - చిలకలూరిపేట

నియోజకవర్గ పరిధిలో పదవ తరగతి ఉత్తీర్ణులైన యాదవ విద్యార్థినీ విద్యార్థులు అందరూ తప్పక హాజరై కెరీర్ గైడెన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని శ్రీ కృష్ణా యాదవ అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు గోరంట్ల నారాయణ యాదవ్,సంస్థ అధ్యక్షులు గోలి భాను ప్రకాష్ యాదవ్ ఉమ్మడిగా తెలిపారు. స్థానిక సి.ఆర్.క్లబ్‌లో శుక్ర వారం జరిగిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఇరవై మూడేళ్లుగా ప్రతి ఏడాది పది పాసైన విద్యార్థులు ఇంటర్ లో ఏ గ్రూప్ తీసుకుంటే ఎటువంటి కెరీర్ అవకాశాలు వుంటాయో,తద్వారా కెరీర్ ను ఎంచుకో వడం లో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి అనే విషయమై సైకాలజీ నిపుణులు, సబ్జెక్ట్ ఎక్స్పర్ట్స్ యూనివర్సిటీ పరిశోధకులు పూర్తి అవగాహన కల్పిస్తారన్నారు. ఆదివారం ఉదయం 10 గం టలకు గుంటూరులోని ఏటూకూరు రోడ్డులోని వివాహ కన్వె న్షన్ లో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పది మార్కుల మెమో, ఆధార్ జిరాక్సు కాపీలను తప్పనిసరిగా తమ వెంట తీసుకు రావాలని, యాదవ విద్యార్థులందరూ ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు ఒక బ్యాగు, కెరియర్ గైడ్స్ కోర్సుల మెటీరియల్ డిక్షనరీ ఉచితంగా ఇవ్వనున్నట్లు చెప్పారు. మిగతా వివరాల కోసం 9014650393/9867013967/9398748233 నంబర్లలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఎన్.నాగరాజుయాదవ్, ఎ.రామకృష్ణ యాదవ్, పి.శ్రీనివాసరావు యాదవ్, కె.రాంబాబు యాదవ్, బి.నాగేశ్వరరావు యాదవ్, ఎన్. హరికిరణ్ యాదవ్ పాల్గొన్నారు.

ఖరీఫ్‌కు రైతులు సమాయత్తం.. పచ్చిరొట్ట సిద్ధం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

మండల పరిధిలో ఖరీఫ్ సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. గత కొన్ని రోజులుగా ఏదో ఒక సమయంలో గట్టి వర్షపు జల్లులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారు. సాధారణంగా జూన్ ఒకటి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుంది. మృగశిరి కార్తెలో వచ్చే పౌర్ణమి నాడు రైతులు ఏరువాక చేపడతారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ ఖరీఫ్ సాగు ప్రణాళికను సిద్ధం చేసింది. ఏ ఏడాదికా ఏడాది ఖరీఫ్ లో మండల స్థాయిలో వరి సాగు తగ్గిపోతోంది. గతంలో వెయ్యి, పదిహేను వందల ఎకరాల వరి సాగు ప్రస్తుతం వంద, నూట యాభై ఎకరాలకు పడిపోయింది. దీనికి ప్రధాన కారణం సాగునీరు లేకపోవడం, దిగుబడి రాకపోవడమేనని రైతులు చెబుతున్నారు. ఏ ఏడాదికా ఏడాది కూరగాయలు, కంది,పెసర మినుము పంటల సాగు తగ్గిపోతోంది. శనగ, మిర్చి,ప్రత్తి పొగాకు, పరిమిత పంటలకు రైతులు పరిమితమౌతున్నారు. ఈ పంటలన్నీ కలిపి నామ మాత్రంగా వందల ఎకరాల్లో పంటల సాగు మాత్రమే ఉంటుంది. ఒక్కోసారి సకాలంలో వర్షాలు పడక, ప్రకృతి అనుకూలించక పంట సాగు పూర్తిగా మారిపోయిన సందర్భా లు ఉన్నాయి. ఈ ఖరీఫ్ అయినా సక్రమంగా వర్షాలు పడి రైతులకు అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. రైతులకు ఖర్చులు, రసాయనిక ఎరువుల వాడకం తగ్గించేందుకు, ఎరువుల కొనుగోళ్ల ఖర్చులు తగ్గించి భూసారం పెంచేందుకు పచ్చిరొట్ట ఎరువులు బాగా ఉపయోగ పడతాయని వ్యవసాయ శాఖధికారులు చెబుతున్నారు.

పచ్చి రొట్ట ఎరువులు వాడకం వలన సహజంగా వాడే రసాయనిక ఎరువులను 30 శాతం తగ్గించ వచ్చని, నత్రజని, భాస్వరము, పొటాషియం మొక్క ఎదుగుదల, కాయ లావు, అధిక దిగుబడులకు సహకరిస్తుందని, భూమి సారవంతంగా ఉంటుందని చెప్పారు. పచ్చిరొట్టఎరువులను రైతు లందరూ తప్పనిసరిగా వాడాలని సూచించారు. పచ్చిరొట్ట ఎరువుల్లో ముఖ్యంగా జీలిగలు, పిల్లి పెసర,జనుము విత్తనాలు ఉపయోగించాలన్నారు. ఈ పచ్చిరొట్ట విత్తనాలు 50 శాతం సబ్సిడిలో ప్రభుత్వం వారు వ్యవసాయ శాఖ ద్వారా ఆర్‌బికెలలో ఇస్తున్నట్లు చెప్పారు. పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం సబ్సిడీలో రైతు భరోసా కేంద్రాల్లో సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు.

పచ్చిరొట్ట పైరు

సబ్సిడిపై పచ్చిరొట్ట విత్తనాలు

మండల వ్యవసాయ శాఖాధికారి వేణుగోపాల్

ప్రజాశక్తి - క్రోసూరు

50 శాతం సబ్సిడిపై పచ్చిరొట్ట విత్తనాలు జిలుగ, జనుము, పిల్లి పెసర విత్తనాలు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి వేణుగోపాల్ తెలిపారు. జీలుగ సబ్సిడీ పోను రూ.44, జనుము రూ.44, పిల్లి పెసర రూ.67. పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు నేరుగా రైతు భరోసా కేంద్ర సిబ్బందిని సంప్రదించాలని చెప్పారు. మండలానికి జీలుగ 118 క్వింటాళ్ల, 68 క్వింటాళ్ల జనుము, 68 క్వింటాళ్ల పిల్లి పెసర విత్తనాలు మొదటి విడతగా తెప్పించామన్నారు. పచ్చిరొట్ట పైర్ల పెంపకానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ఈ విత్తనాలు ఇంకా రైతులకు కావలసివస్తే మళ్లీ తెప్పించే అవకాశముందని చెప్పారు. ఈ విషయంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు.

'ఛలో మాచర్ల'ను పోలీసులు అడ్డుకోవడం సరికాదు

ప్రజాశక్తి - క్రోసూరు

ఛలో మాచర్ల కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకోవడం సరికాదని యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య అన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రమైన క్రోసూరులో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ మాచర్ల నియోజకవర్గం పాల్వాం యిగేటు పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం చేసిన పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని వర్గీయుల దాడిలో గాయపడిన టిడిపి కార్యకర్తలను పరామర్శించేందుకు తలపెట్టిన 'ఛలో మాచర్ల'ను పోలీ సులు అడ్డుకోవడం సబబు కాదన్నారు. ఎక్కడికి పారి పోలేదని కావాలంటే రెండు గంటల్లో మాచర్లకు రాగలనని బీరాలు పలికిన పిన్నెల్లి ఇప్పటికి పరారీలోనే ఉన్నారని విమర్శించారు. రాష్ట్రంలో డి.జి.పి మారిన పోలీసు తీరు మారలేదన డానికి పిన్నెల్లి పరారీ ఉదంతమే నిదర్శనమన్నారు. జగన్ విదేశాలకు వెళ్ళిన ప్రతిసారి రాష్ట్రంలో ఏదో ఒక హింస జరుగుతుందని అన్నారు. సమావేశంలో అను ముల వెంకట్రామిరెడ్డి, నలజాల కోటి, మన్నెం శ్రీను, రామాంజనేయులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

ప్రజాశక్తి - రెంటచింతల

మండల కేంద్రమైన రెంటచింతలలోని రైలు పేటలో డయేరియా ప్రబలి ఇబ్బందులు పడుతున్న వారికి స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎన్ కృష్ణారెడ్డి ఇం టింటి సర్వే చేపట్టి సీజనల్ వ్యాధులను గురించి అవగాహన కల్పించారు. పంచాయతి సిబ్బంది శానిటేషన్ పనులను చేపట్టారు తాగునీటి నాణ్యత పరీక్షలు చేశారు రెండు రోజులు పాటు వైద్య శిబిరం కొనసాగుతుందన్నారు.

ఆర్‌బికెల్లో అందుబాటులో లేని కిట్లు

- మండలంలోని 16 ఆర్‌బికెల్లో భూసార పరీక్ష కిట్లు, కెమికల్స్ లేవు
- ఐదేళ్లుగా ఇదే పరిస్థితి: రైతులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

రైతు ప్రయోజనాలే ధ్యేయంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల(ఆర్‌బికె) ద్వారా భూసార పరీక్షలు జరగాల్సి ఉంది. అయితే, గత ఐదేళ్లుగా ఇందుకు సంబంధించిన టెస్టింగ్ కిట్లు, కెమికల్స్ గానీ ఆర్‌బికెల్లో ఎక్కడా అందు బాటులో లేవు. మండలం మొత్తం మీద 23 గ్రామాల్లో 16 ఆర్‌బికెలు ఉన్నాయి. ఏ ఒక్క ఆర్‌బికెలో కూడా భూసార పరీక్షల కిట్లు, సంబంధిత కెమికల్స్ లేవని రైతులు చెబుతున్నారు. రైతు భరోసా కేంద్రాలు అందు బాటులోకి వచ్చి గ్రామా ల్లో ఐదో సీజన్లు పూర్తి అయ్యాయి. కానీ భూ సార పరీక్షలు చేసేందుకు తగిన పరికరాలు, ఉద్యోగులు మాత్రం అందుబాటులోకి రాలేదంటున్నారు. రైతులు భూ సార పరీక్షలు చేయించుకుని భూసార దాని ఫలితాలను అనుగుణంగా ఏఏ సూక్ష్మ పోషకాల పరిస్థితులు ఎట్ల వున్నాయో వాటి కి సంబంధించి ఎటువంటి ఎరు వులను వాడాలో, ఏ తరహా పంట లు వేయాలో ప్రణాళిక బద్ధంగా వ్యవసాయాన్ని ప్రారంభి స్తారు. పంటల సాగుకు, దిగుబడులకు, సూక్ష్మ పోష కాలు, ఎరువుల వినియోగానికి సంబంధించి భూసార పరీక్షలు చేయించడం కీలకమని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఆర్‌బికెలలో అధిక సంఖ్యలో భూసార పరీక్షలు జరిపించాలని, అధిక దిగుబడులు సాధించేలా సహకరించాలని రైతులు కోరుతున్నారు.

వేగుల ద్వారా సమాచారం సేకరిస్తున్న సిట్ బృందం

ప్రజాశక్తి -రెంటచింతల

ఈ నెల 13న పోలింగ్ సందర్భంగా జరిగిన అల్లర్లకు సంబంధించి ఎవరెవరు పాత్ర ఎంత, నిజమైన నిందితులు ఎవరు అనే దానిపై సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం) బృందం ఆరా తీసే పనిలో నిమగ్నమై ఉంది. ఏసీబీ డిఎస్పి సిట్ ప్రత్యేక అధికారి మూర్తి నేతృత్వంలో వాస్తవాలను వేగుల ద్వారా సేకరిస్తున్నారు. మాచర్ల అల్లర్లకు సం బంధించి పల్నాడు ఎస్పి బిందు మాధవ్ సస్పెండ్ అయిన నేపథ్యంలో పోలీసు శాఖ ఈ దౌర్జన్యాలను సవాల్గా తీసుకుంది. గతంలో పోలీస్ రికార్డుల్లో పేరు నమోదు అయి ఉండి రెండు కేసుల్లో నిందితులుగా ఉంటే రౌడీ షీట్ ఓపెన్ చేయబోతున్నారు. రెండు ప్రధాన పార్టీలకు చెందిన నేతలు గ్రామాలు వదిలిపోయారు. సెల్ ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా సమాచారం సేకరిస్తున్నారు.

ఎపి సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా శాంతిబాయి

ప్రజాశక్తి-మాచర్ల

ఎపి సిపిఎస్ ఉద్యోగుల సంఘ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా మాచర్ల టౌన్‌కు చెందిన డాక్టరు సాంబేలు శాంతి బాయి ఎన్నికయ్యారు. విజయ వాడలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆమెను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సమా చారం. ఈ సందర్భంగా ఆమెకు ఉపాధ్యాయ సంఘ నాయకులు, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలిపారు.

తిరుణాళ్ల ఊరేగింపులకు అనుమతి నిరాకరణ

ప్రజాశక్తి-ఈపూరు

ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉన్నందున కొచ్చర్ల శ్రీ అంకాల పరమేశ్వరి తిరుణాల్ల సందర్భంగా గ్రామంలో పాలేటి బండి, మొక్కుబడి ప్రభల ఊరేగింపులకు ఎలాంటి అనుమతులు లేవని ఎస్సై షేక్ మొహమ్మద్ ఫిరోజ్ తెలిపారు. అలాగే, తిరుణాళ్ల అనంతరం గుడి చుట్టూ తిరిగే సుడిబండికి అనుమతులు లేవని చెప్పారు. ఈ విషయమై గ్రామస్తులు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
శనివారం 25 మే 2024

అమలుకు నోచుకోని హామీలు

ప్రజాశక్తి-తెనాలి

నియోజకవర్గ అభివృద్ధికి సాక్షాత్తు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు ఏడాది గడిచిపోయినా అమలుకు నోచుకోలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆయా హామీలపై 2003 ఫిబ్రవరి 28న సభలో ఉద్వేగంగా ఉపన్యసించిన స్థానిక శాసనసభ్యులు కూడా స్పందించకపోవటం దయనీయం. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

గతేడాది ఫిబ్రవరి 28న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా నాలుగో విడత పంపిణీ ప్రారంభానికి తెనాలిని వేదిక చేసుకున్నారు. ఆ సందర్భంగా మార్కెట్ కమిటీ ఆవరణలో భారీ బహిరంగ సభ నిర్వహించారు. రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ, రైతులతో మాటా మంతి అన్నీ ఎంతో ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన రెడ్డి, వైద్యఆరోగ్య శాఖామంత్రి విడదల రజని, ఇంకా వైసిపి అతిరథ మహారథులు పొల్గొన్న వేదికపై స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఎంతో అత్యుత్సాహంతో ప్రసంగించారు. నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, దానికి కావాల్సిన నిధులపై కూడా సభా వేదిక సాక్షిగా ఎంతో భావోద్వేగంతో సిఎంకు వివరించారు. శివకుమార్ అభ్యర్ధనలను పరిగణనలోకి తీసుకుని మాట్లాడిన సిఎం జగన్, ఎమ్మెల్యే శివకుమార్ ప్రతిపాదించిన పనులకు సభావేదిక సాక్షిగా మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు.

వాటిలో మున్సిపల్ భవన నిర్మాణానికి రూ.15కోట్లు, నియోజకవర్గంలో ఎస్సీ సామాజిక వర్గాల స్మశాన వాటికలకు ఆవసరమైన స్థల సేకరణకు రూ.9కోట్లు, పట్టణంలో ముస్లింల షాదీఖానా నిర్మాణానికి రూ.4కోట్లు, నందివెలుగు-కొల్లిపర రోడ్డు విస్తరణకు రూ.9కోట్లు, కొల్లిపరలో అరటి రైతుల కోసం మిని మార్కెట్ యార్డు నిర్మాణానికి రూ.5కోట్లు మొత్తం రూ43కోట్ల నిధులు మంజూరు చేస్తున్నట్లు నాయకులు హర్షధ్వానాల మధ్య ప్రకటించారు.

ఇంకేముంది..సాక్షాత్తూ ముఖ్యమంత్రే ప్రకటించారు గదా..అన్నీ ఆఘమేగాల మీద జరిగిపోతాయని ప్రజలు బావించారు. అయితే ఏడాది దాటినా సిఎం ఇచ్చిన హామీలకు అడుగు కూడా ముందుకు పడలేదు. తిరిగి ఎన్నికలు కూడా జరిగిపోయాయి. కొల్లిపర మినిమార్కెట్ యార్డుకు స్థల సేకరణ జరుగుతుందని కొద్ది నెలల క్రితం ప్రచారం జరిగినా వాస్తవాలు వెల్లడి కాలేదు. హామీలిచ్చి విస్మరించటంలో నాయకులదే అగ్రస్థానం అనుకుంటే, సాక్షాత్తూ సిఎం ఇచ్చిన హామీలు కూడా అందుకు మినహాయింపేమీ కాదని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



తెనాలి సభలో సిఎం జగన్, శివకుమార్, నాయకులు (ఫైల్‌ఫోటో)

మసిబూసి మారేడుగాయ చేశారు

సుద్దపల్లి మురళీధర్, న్యాయవాది, తెనాలి

నియోజకవర్గంలో వైసిపి ఐదేళ్ళ పాలనలో ఒక్క రోడ్డు బాగుచేయలేదు. తాగు, సాగునీటి సమస్యలూ తీర్చలేదు. ఎస్సీ సామాజిక వర్గాలకు స్మశానవాటికల్లేక ఇబ్బంది పడుతున్న సందర్భాలు అనేకం. స్థానిక శాసనసభ్యులు దృష్టికి వచ్చినా పట్టించుకోలేదు. సిఎం తెనాలి వచ్చిన సందర్భంగా తెనాలికి మేలు జరుగుతుందని ఆశించాం. ఐదారు సమస్యలకు సంబంధించి ఆయన కోట్లలోనే హామీలిచ్చారు. ఏడాది దాటిపోయింది. మరలా ఎన్నికలూ జరిగాయి. అయినా ఆ హామీలకు సంబంధించి అడుగు కూడా ముందుకు పడలేదు. స్థానిక నాయకులు సంగతెలా ఉన్నా సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలకే అతీగతీ లేదంటే ఏమనాలి. ఇంతకంటే దారుణంగా మోసం చేయటం ఎవరికీ సాధ్యం కాదేమో. దీనిపై శాసనసభ్యులు సమాదానం చెప్పాలి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-తాడేపల్లి

విద్యుత్ లైన్ల అత్యవసర మరమ్మతుల నిమిత్తం 25వ తేదీ శనివారం ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు తాడేపల్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డిఇ అక్కల సత్యనారాయణ, ఎఇ షణ్ముకరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉండవల్లి సెంటర్ కొత్త కాలువ నుండి ఉండవల్లి గుహలు వరకు, హరిజనవాడ, కుమ్మరికుంట , కోస్టల్ బ్యాంకు ఏరియా, అమరారెడ్డి నగర్, కోలా సుబ్బారావు స్ట్రీట్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

ఎక్కడి చెత్త అక్కడే...

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో గత నాలుగు రోజులుగా శానిటేషన్ అద్వానంగా తయారయింది. పట్నంలో ఎక్కడ చూసినా చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో దుర్వాసన వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతిరోజు శానిటేషన్ సిబ్బంది చెత్త తీస్తూ ఉండేవారు. ఎన్నికల నిబంధనలు అమలులో ఉండటం వలన అధికారుల పర్యవేక్షణ లోపిస్తుంది. పర్యవేక్షణ లేకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడ పేరుకుపోయింది. సంబంధిత అధికారులు కలగజేసుకొని చెత్తకుప్పలను ఎత్తివేయాలని ప్రజల కోరుతున్నారు.

పాత బస్టాండ్ సెంటర్లోని పేరుకుపోయిన చెత్త

కౌంటింగ్ తక్షణం ఆపాలని వినతి

ప్రజాశక్తి-గుంటూరు

కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న రత్నం

ఇటీవల పార్లమెంటు, శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ ఆదేశాలను తుంగలో తొక్కి అభ్యర్థులు వందల కోట్ల రూపాయలు ప్రచారాలకు ఖర్చు పెట్టడంతో పాటు ఓటర్ల ప్రలోభాలకు ఖర్చుపెట్టారని కనుక కౌంటింగ్ నిలిపివేయాలని, అభ్యర్థుల ఖర్చులపై నిగ్గు తేల్చి, ఆ అభ్యర్థులను అనర్హులుగా ప్రకటించాలని లోక్ తాంత్రిక జనతాదళ్ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి బూరుగ రత్నం కోరారు. ఈమేరకు జిల్లా ఎన్నికల అధికారి యం. వేణుగోపాల్‌రెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందచేశారు. పార్లమెంటు అభ్యర్థి రూ.95 లక్షలు, అసెంబ్లీ అభ్యర్థి రూ.40 లక్షల వరకు ఖర్చు చేయాలని చట్టం చెబుతున్నా ఏమాత్రం పాటించకుండా కోట్లాది రూపాయలు వెచ్చించి ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని రత్నం అన్నారు. ఈ అంశాలపై తక్షణం విచారణ చేసి చర్యలు తీసుకోకుంటే రాష్ట్ర ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

రక్షిత మంచి నుండి చెరువును పరిశీలిస్తున్న ఎంపీడీవో

కొర్రపాడు రక్షితనీటి చెరువు పరిశీలన

ప్రజాశక్తి - మేడికొండూరు

మండలంలోని కొర్రపాడు గ్రామ పరిధిలోని రక్షిత మంచినీటి పథకం చెరువును మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రభాకర్ రావు, పలువురు అధికారులు శుక్రవారం పరిశీలించారు . రక్షిత మంచినీటి చెరువులో జమ్ము కాల్చి శుభ్రం చేయకుండా ఆపరిశుభ్రంగా ఉందని గ్రామంలో పలువురు మండల పరిషత్ అభివృద్ధి అధికారికి ఫిర్యాదు రూపంలో తెలిపారు. స్పందించిన అధికారులు చెరువులో ఉన్న పరిసరాలను పరిశీలించారు. అంజిరెడ్డి చెరువు పరిశుభ్రంగానే ఉందని అధికారులు గుర్తించారు. ఈ తనిఖీలలో పిఓపిఆర్డి పెద్దింటి రవికుమార్, మండల ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుజాత, పంచాయతీ సెక్రెటరీ వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

1620వ రోజుకు రైతుల దీక్షలు

ప్రజాశక్తి - తుళ్లూరు

రాష్ట్ర ఏకైక రాజధానిగా అమరావతి కొనసాగాలని డిమాండ్ చేస్తూ రైతులు చేస్తున్న దీక్షలు శుక్రవారంతో 1620 వ రోజుకు చేరాయి. తుళ్లూరు,వెంకటపాలెం, అనంతవరం,వెలగపూడి తదితర గ్రామాల్లో దీక్షలు సాగాయి.ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా అమరావతిని నిర్మించాల్చిందేనని రైతులు,రైతు కూలీలు,మహిళలు స్పష్టం చేశారు.అమరావతి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొవ్వొత్తులు వెలిగించి బిల్డ్ అమరావతి - సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు.

కళ్యాణంతో ఘనంగా ముగిసిన బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - పెదనందిపాడు రూరల్

మండలం లోని నాగులపాడు గ్రామంలో శ్రీ శంగేరి శారదా పీఠ పాలిత శ్రీవల్లి దేవసేన సమేత స్వయంభు శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవాలయంలో గత ఏడు రోజులుగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలు శుక్రవారం జరిగిన కళ్యాణ మహో త్సవంతో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో కర్ణాటక నుండి 11 మంది దంపతులు . ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి 35 మంది దంపతులు పాల్గొని కన్నుల పండుగగా కమిటీ వారి సహకారంతో కళ్యాణ మహొూత్సవాన్ని ఘనంగానిర్వహించారు. ఈ సందర్భంగా పాలకమండలి సభ్యులు మాట్లాడుతు ప్రశాంత వాతావరణంలో బ్రహ్మోత్సవాలు నిర్వహించిడానికి సహకరించిన పోలీస్ శాఖ, ప్రజలకు వారు తమ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పెయిడ్ హాలిడేస్ బకాయిలు ఇవ్వకుంటే ఆందోళన

ప్రజాశక్తి-గుంటూరు

షిఫ్ట్ ఆపరేటర్లకు, వాచ్‌మెన్‌లకు 2018 నుండి ఇవ్వాల్సిన పెయిడ్ హాలిడేస్ బకాయిలు ఈనెల 31వ తేదీలోగా చెల్లించాలని, లేనిఎడల ఆందోళనకు పూనుకుంటామని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. ఈమేరకు యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎపిసిపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్‌కు నోటీసులు అందజేశారు. బకాయిల కోసం అనేసార్లు విజ్ఞప్తి చేసినా కార్మికులకు ఆ సొమ్ము చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బకాయిలు చెల్లించాలని కోరారు. లేని ఎడల 1వ తేదీ తర్వాత ఎప్పుడైనా ఆందోళనకు పూనుకుంటామని పేర్కొన్నారు. నోటీసులు ఇచ్చిన వారిలో యూనియన్ గౌరవాధ్యక్షులు బి.లక్ష్మణరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.పవన్, జి.నాగరాజు, కోశాధికారి జి.రాంబాబు తదితరులున్నారు.

ఫొటోగ్రాఫర్ శ్రీనివాసబాబు మృతి

ప్రజాశక్తి తెనాలి

పట్టణానికి చెందిన ప్రెస్ ఫోటోగ్రాఫర్ చుక్కా శ్రీనివాసబాబు (64) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక చంద్రబాబు నాయుడు కాలనీకి చెందిన ఆయన గతంలో నందులపేట బసవ మందిరం ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా కూడా పనిచేశారు. సుదీర్ఘకాలంగా ప్రెస్ ఫోటోగ్రాఫర్‌గా కూడా పనిచేస్తున్నారు. గత కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఆయన ఆరోగ్యం క్షీణించటంతో దాదాపు నెలరోజులుగా మంచానికే పరిమిత మయ్యారు. ఆయన మృతికి పలువురు పట్టణ ప్రముఖులు, పాత్రికేయులు సంతాపం వ్యక్తం చేశారు.

శాంతి భద్రతల్ని కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే

ప్రజాశక్తి - మంగళగిరి

పల్నాడు, తిరుపతి, తాడిపత్రిలలో ఎన్నికల అనంతరం జరిగిన అల్లర్లలో హింస, దౌర్జన్యాలకు గురై గాయపడి, ఆసుపత్రుల పాలైన బాధితుల్లో, ఎక్కువమంది అణగారిన వర్గాలకు, బీసీ కులాలకు చెందిన వారేనని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అమలవుతున్న తరుణంలో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే అని ఆయన అన్నారు. ఏ ఆధిపత్య కుల సంపన్న వర్గాలకు చెందిన రాజకీయులు, ప్రత్యక్షంగా ఘర్షణలలో పాల్గొనడం లేదని, భౌతిక దాడులకు గురికావడం లేదన్నారు. కేవలం అమాయకులు, నిరక్షరాస్యులైన పేద-బహుజన వర్గాల వారిని, " కులాలని, మతాలని, రాజకీయ పార్టీలు" అంటూ రెచ్చగొట్టి, ప్రధాన రాజకీయ పార్టీలు పబ్బం గడుపుకుంటూ, హింస-దౌర్జన్యాలను పెంచి పోషిస్తున్నాయని శంకర్రావు విమర్శించారు. దీనివల్ల పేదలు-బడుగులే ప్రాణాలు పోగొట్టుకోవడం, కుంటి- గుడ్డివారీగా అవిటితనంతో జీవితాంతం బాధపడుతున్నారన్నారు. ఆపై పోలీసు కేసులు, సామాజిక చిన్న చూపుతో మానసికంగా కంగిపోతూ, ఆర్థికంగా అన్ని విధాలా బలహీన వర్గాలే నష్టపోతున్నాయన్నారు. ఎన్నికల తరుణంలో, శాంతి భద్రతలను కాపాడాల్సిన బాధ్యత, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన కేంద్ర-రాష్ట్ర ఎన్నికల సంఘాల నేతత్వంలోని పోలీసు రక్షణ శాఖలపై ఉన్నదన్నారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తతో మెలిగి, ఇప్పటికే జరిగిన అల్లర్లపై నిష్పాక్షికంగా దర్యాప్తు జరిపించాలన్నారు. అల్లరి మూకలకు అండదండ లిచ్చి,వెనకుండీ నడిపించిన రాజకీయ నాయకులతో సహా, దోషులందరి పైన కేసులు పెట్టి,కఠినంగా శిక్షించాలని శ్రీ కేసన కోరారు. ఈ నేపథ్యంలో జూన్ 4 ఫలితాల విడుదల అనంతరం కూడా, ఎట్టి దౌర్జన్య పూరిత దాడులు, అల్లర్లు జరగకుండా చూడాలన్నారు. కనీసం 15 రోజులపాటు కేంద్ర- రాష్ట్ర రక్షణ బలగాలు అప్రమత్తతో ఉండి, అసాంఘిక శక్తులను నిర్దాక్షిణ్యంగా అణిచివేస్తూ, పేదలు బడుగులను ఆదుకునేలా, శాంతి భద్రతలను కాపాడాల్సిందిగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి శంకరరావు విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి కె రాజ్యలక్ష్మీ

కౌంటింగ్‌కు అభ్యర్థులు సహకరించాలి

ప్రజాశక్తి-గుంటూరు

సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సజావుగా, సకాలంలో జరిగేందుకు అభ్యర్థులు సహకరించాలని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుపై గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులతో ప్రత్యేక సమావేశం జరిగింది. కౌంటింగ్ రోజు ఉదయం 6.30 గంటలకు అభ్యర్థులు స్ట్రాంగ్ రూమ్ వద్దకు రావాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కౌంటింగ్ కేంద్రంలోకి రిటర్నింగ్ అధికారి ద్వారా జారీ చేసిన గుర్తింపు కార్డులను తప్పనిసరిగా ధరించాలని, సెల్‌ఫోన్‌లు కేంద్రంలోనికి అనుమతి ఉండదన్నారు. పోస్టల్ బ్యాలేట్ లెక్కింపునకు 5, ఈ.వి.యంల ఓట్ల లెక్కింపుకు 14 టేబుల్స్ కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ.వి.యంల స్ట్రాంగ్ రూమ్ ఉదయం 6.30 గంటలకు ఓపెన్ చేయటం జరుగుతుందన్నారు. అభ్యర్థులు నిర్దేశిత సమయానికి స్ట్రాంగ్ రూమ్ వద్దకు రావాలని కోరారు. సమావేశంలో ఏఆర్‌ఓలు సి.హెచ్ శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, సూపరిండెంట్లు పద్మ, సాంబశివరావు, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ భాస్కర్, పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేసిన అభ్యర్థులు, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో సెక్రెటరీ, ప్రిన్సిపాల్

కెఎల్‌పి స్కూల్లో ముసిగిన రోబోటిక్స్ శిక్షణ

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని డాక్టర్ కెఎల్‌పి పబ్లిక్ స్కూల్లో ఈనెల 12 నుండి 24వ తేదీ వరకూ 6-10వ తరగతి విద్యార్థులకు టెస్లాహౌస్ ద్వారా రోబోటిక్స్‌పై అవగాహనకు నిర్వహించిన శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్కూల్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు రోబోటిక్స్ నేర్చుకోవటం ద్వారా సైన్స్, సెన్సార్స్, మోటార్స్, ప్రోగ్రామింగ్‌పై పట్టు సాధించటానికి పడుతుందన్నారు. భవిష్యత్‌లో రోబోటిక్స్‌కి, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌కి ప్రాముఖ్యత పెరుగుతుందన్నారు. పాఠశాల విద్యార్థులు రోబోటిక్స్ పట్ల వారికున్న ఉత్సుకతతో నేర్చుకోవటం సులభతరం అవుతుందని, ఆ ఉద్దేశంతోనే టెస్లాహైస్ ద్వారా శిక్షణ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సెక్రెటరీతోపాటు, ప్రిన్సిపాల్ వై.రఢనీచౌదరి, ఏఓ కె.వెంకట్రావు అభినందించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దేగల ప్రభాకర్ తదితరులు

రేపు ఏటుకూరులో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ఏటుకూరులో ఈనెల 26న ఆదివారం ఉదయం 9 గంటలకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ చైర్మన్ దేగల ప్రభాకర్ పేర్కొన్నారు. ఉచిత మెగా వైద్య శిబిరంకు సంబంధించిన గోడపత్రికలను శుక్రవారం డాక్టర్లు తో కలిసి దేగల ప్రభాకర్ విడుదల చేశారు.ఆంధ్ర ప్రైమ్ హాస్పిటల్ అద్వర్యం నిర్వహిస్తున్న మల్టీ స్పెషాలిటీ ఉచిత వైద్య శిబిరాన్ని ఎటుకూరు, బొంతపాడు ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సూపర్ స్పెషాలిటీ డాక్టర్స్ కార్డియాలజీ, జనరల్ మెడిసిన్, పల్మనాలజిస్ట్,ఆర్థోపెడిక్, పీడియాట్రీషియన్, డెంటిస్ట్,ఎండి జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, ఆప్తమాలజిస్ట్, ఇతర రుగ్మతలకు సంబంధించిన స్పెషాలిటీ డాక్టర్స్ ఉచితంగా వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అచింశెట్టి అన్వేష్ కుమార్, తేజస్వి జల్లేపల్లి, జగదీష్ చెరుకూరి, బడుగు పవన్, సాయి రాజశేఖర్ కాసుల, ఊటుకూరి గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ ఏజెంట్ల వివరాలు అందించాలి

- సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదు - పేపరు, పెన్ను తీసుకెళ్లవచ్చు
- అభ్యర్థులతో సమావేశం నిర్వహించిన గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపునకు ఆచార్య నాగార్జునా యూనివర్శిటీలోని వివిధ బ్లాక్‌లలో కౌంటింగ్ హాల్స్ ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎం. వేణు గోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కలక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ ఓట్ల లెక్కింపుపై పార్లమెంట్ నియోజకవర్గానికి పోటీలో వున్న అభ్యర్థులు, వారి ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఆచార్య నాగార్జున యూని వర్సిటీలో జూన్ 4వ తేదీన జరుగుతుంద న్నారు. ఆచార్యా నాగార్జునా యూనివర్శిటీలోని ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ కాలేజీ విభాగంలో తాడికొండ, సివిల్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో మంగళగిరి, తెనాలి, ప్రత్తిపాడు, అలాగే ధర్మల్ సైన్స్ ల్యాబ్ (వర్క్ షాప్)లో పొన్నూరు,ఈసిఈ అండ్ ఈఈఈ బ్లాక్‌లో గుంటూరు పశ్చిమ, గుంటూరు తూర్పు నియోజకవర్గానికి సంబంధించిన పార్లమెంటు ఓట్ల లెక్కింపునకు ప్రతి నియోజకవర్గానికి 14 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్, ఈటిపిబిఎస్ ఓట్ల లెక్కింపునకు సెంట్రల్ బ్లాక్‌లో 14 టేబుల్స్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోటీలో వున్న అభ్యర్థులు టేబుల్‌కు ఒకరు చొప్పన ఏజెంట్లను నియమించుకోవాలని, మే 30వ తేదీ నాటికి వారి వివరాలు అందిస్తే గుర్తింపు కార్డులు జారీ చేస్తామన్నారు. పోటీలో వున్న అభ్యర్థితో పాటు ముఖ్య ఏజెంట్ ఒకరు అన్ని నియోజకవర్గాలలో జరుగుతున్న పార్లమెంట్ ఓట్ల కౌంటింగ్‌ను పరిశీలించుకునే అవకాశం వుంటుందన్నారు. పోటీలో వున్న అభ్యర్థుల సమక్షం లో జూన్ 3వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు గుంటూరు కలెక్టరేట్‌లోని ఈటిపిబిఎస్ ఓట్లతో పాటు, అన్ని నియోజకవర్గాల్లోని గుంటూరు పార్లమెంట్‌కు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ పెట్టెలు ఆచార్య నాగార్జున యూనివర్శిటీకి తరలించడం జరుగుతుందని, అక్కడ ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచడం జరుగు తుందన్నారు. కౌంటింగ్ రోజు జూన్ 4వ తేదీ అభ్యర్థులు, వారి ఏజెంట్లు ఉదయం 6 గంటల సమయానికి ఆచార్య నాగార్జున యూనివర్శిటీకి చేరుకుంటే వారి సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌ల సీల్ తీసి పోస్టల్ బ్యాలెట్, ఈవియంల ఓట్ల కౌంటింగ్‌కు సిద్ధం చేస్తామన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం అవుతుందన్నారు. పార్లమెంట్‌కు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఫలితాలు రౌండ్ల వారీగా అన్ని నియోజకవర్గాల కౌంటింగ్ హాల్స్ నుండి ఎప్పటికప్పుడు తెప్పించి, రిటర్నింగ్ అధికారి టేబుల్స్ వద్ద ప్రదర్శించడం జరుగుతుందన్నారు. పోటీలో వున్న అభ్యర్థులు కౌంటింగ్‌పై అవగాహన వున్న వారిని ఏజెంట్లుగా నియమించుకోవాలన్నారు. గుర్తింపు కార్డు వున్న వారిని మాత్రమే కౌంటింగ్ హాల్‌లో సంబంధిత టేబుల్ వరకు అనుమతించడం జరుగుతుందని, సెల్ ఫోన్లు అనుమతించరని , పేపర్, పెన్ను తీసుకొనివెళ్ళవచ్చన్నారు. కౌంటింగ్ హాల్‌కి వంద మీటర్ల దూరం వరకు మాత్రమే వాహనాలను అనుమతిస్తారని అన్నారు. నిర్దేశించిన ప్రాంతాలలోని వాహనాలు నిలుపుకొని కౌంటింగ్ సెంటర్‌కు రావల్సి వుంటుందన్నారు. సమావేశంలో డిఆర్‌ఓ పెద్ది రోజా తదితరులు పాల్గొన్నారు.

హింసాత్మక ఘటనలకు తావులేకుండా చూడాలి

- రిటర్నింగ్ అధికారులు ఆర్.ఓ బుక్‌లోని నిబంధనలు పాటించాలి
- రిసెప్షన్ కేంద్రం వద్ద నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ బాలజీరావు

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

సార్వత్రిక ఎన్నికలలో భాగంగా జూన్ 4 న జరగనున్న కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా పకడ్బందీగా నిర్వహించడమే లక్ష్యమని జిల్లా ఎన్నికల అధికారి, మరియు పల్నాడు జిల్లా కలెక్టర్ శ్రీకేశ్ బి లత్కర్ బాలజీరావు అన్నారు. గురువారం స్థానిక నరసరావుపేట కలెక్టరేట్ లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్లు మరియు పోస్టల్ బ్యాలట్ నోడల్ అధికారులతో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాలజీరావు మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియలో భాగంగా సంబంధిత నియోజకవర్గ రిటర్నింగ్ అధికారులు కౌంటింగ్ సెంటర్ లోని స్ట్రాంగ్ రూముకు 2 రోజులలో పోస్టల్ బ్యాలట్‌లను తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ సెంటర్ ముందు అర కిలోమీటర్ పరిధిలో వాహనాలకు అనుమతి లేదన్నారు. నియోజకవర్గాల వారీగా 7 ముఖ ద్వారాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కౌంటింగ్ సిబ్బందికి సంబంధించి తొలి రాండ్మైజేషన్ ప్రక్రియ ఈ నెల 27న చేపట్టడం జరుగుతుందని, రెండవ రాండమైజేషన్ ప్రక్రియ ఎన్నికల పరిశీలకుల సమక్షములో జూన్-3 వ తేదీన చేపట్టడం జరుగుతుందని, మూడవది ఎన్నికల పరిశీలకుల సమక్షములో జూన్-4వ తేది ఉదయం 5 గంటలకు చేపట్టడం జరుగుతుందన్నారు. రిటర్నింగ్ అధికారులు స్ట్రాంగ్ రూము నుండి క్యూలైన్ పద్ధతిలో కౌంటింగ్ హాలుకు ఇవిఎంల తరలింపునకు సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. వారికి తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ఉండేలా చూడాలన్నారు. దీనిని విడియో గ్రఫీ చేయాలన్నారు. సిబ్బందిని గుర్తించుటకు వివిధ రంగుల టి షర్టులు అందచేయడం జరుగుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయమై సంబంధిత పోస్టల్ సిబ్బందికి శాఖ సమన్వయంతో ముందస్తుగా అందేలా చూడాలన్నారు. ఈ నెల 31న కౌంటింగ్ ఏజంట్ల వివరాలు అనుమతించబడవని ఆయన తెలిపారు. రౌండ్ వైజ్ సమాచారాన్ని మీడియా సెంటర్‌కు ఎప్పటికప్పుడు అందించేలా సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. రిసెప్షన్ సెంటర్ వద్ద నిబంధనలు అతిక్రమించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ టేబుల్స్ వద్ద అభ్యర్థులు అందరు సమానమే అని ఎన్నికల పరిశీలకులకు కేటాయించిన సీట్లలో ఎవ్వరని అనుమతించవద్దని సూచించారు. నిబంధనల మేరకు విధులు నిర్వహించాలని, ఏమైనా అవకతవకలు జరిగితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియలో పాల్గొనే సిబ్బంది మొబైల్ ఫోనులను కౌంటింగ్ సెంటర్ లోని అనుమతించకుండా వాటిని నియోజిక వర్గాల వారీగా ప్రత్యకంగా భద్రపరచడం జరుగుతుందన్నారు. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ మాట్లాడుతూ పోస్టల్ బ్యాలెట్ వివరాలు ఎన్ కోర్ లో ఎలా అప్లోడ్ చేసే ప్రక్రియను క్షుణ్ణంగా వివరించారు. అదేవిధంగా మాస్టర్ ట్రైనర్ కౌంటింగ్ ప్రక్రియ గురించి వివరించారు. కార్యక్రమములో జిల్లా రెవెన్యూ అధికారి కె. వినాయకం, కౌంటింగ్ సంబందిత సిబ్బంది పాల్గొన్నారు.

హాజరైన అధికారులు, కౌంటింగ్ సిబ్బంది